
# ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY



5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

ఆదివారం 29 జూన్ 2025


## రూ.100 కోట్లతో ఇంటింటికీ తాగునీరు

● బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అమృత్ 2.0 పథకంలో భాగంగా పెనుకొండలో రూ.100కోట్లతో ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో రూ.60లక్షలతో నూతనంగా నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాలు, పేదల ఆకలి తీర్చుతున్న అన్న క్యాంటీన్లను మూయించిన దుర్మార్గుడు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మూడేళ్లుగా పెనుకొండలో సొంత డబ్బుతో అన్న క్యాంటీన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరలో మరిన్ని అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసి ప్రజల్లో నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పేదల పక్షపాతి అని పేర్కొన్నారు. రూ.5కే పేదలకు అన్నం పెడుతున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందన్నారు. పదిరోజుల్లో అన్నదాత సుఖీభవ నగదు రైతుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ శ్రీధర్, కమిషనర్ సతీష్‌కుమార్, కార్పొరేషన్ డైరెక్టర్లు కేశవయ్య, శ్రీనివాసులు, కన్వీనర్లు శ్రీరాములు, ప్రసాద్, బీజేపీ రామకృష్ణ, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## నేరాలను నియంత్రించండి: ఎస్పీ



ఎస్పీ రత్న నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న కొత్తచెరువు సీఐ మారుతీ శంకర్

పుట్టపర్తి రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేర నియంత్రణకు అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించుకోవాలని ఎస్పీ వి.రత్న పోలీసు అధికారులకు సూచించారు. మహిళలపై జరిగే నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలతో శనివారం నేర సమీక్ష నిర్వహించారు. స్టేషన్లవారీగా పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకున్నారు. ప్రాధాన్య కేసులలో ముద్దాయిలకు శిక్ష పడేలా, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రేవ్, నాన్ గ్రేవ్, యూఐ, ఎస్సీ, పోక్సో, లోక్ అదాలత్ కేసులపై దృష్టిసారించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడా ఓపెన్ డ్రింకింగ్ లేకుండా కార్డన్ సెర్చ్, గ్రామ సందర్శనలు చేపట్టాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో గస్తీలు చేపట్టి, అనుమానితుల వేలిముద్రలను సేకరించాలని, వాటిని పాతనేరస్థుల రికార్డులతో సరిపోల్చాలని సూచించారు. ప్రతి సబ్ డివిజన్లో ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్స్‌ను గుర్తించాలని సూచించారు. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, దొంగతనాల నివారణ, ప్రాపర్టీ రికవరీకి కృషి చేయాలని సూచించారు. గత నెలలో వివిధ కేసుల దర్యాప్తులో ప్రతిభ కనపరిచిన పోలీసు అధికారులకు ప్రశంసాపత్రాలను అందచేశారు. నేర సమీక్షలో డీఎస్పీలు విజయ్‌కుమార్, శివన్నారాయణ, కేవీ మహేశ్, నరసింగప్ప, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పనిచేయడానికి ఆశా కార్యకర్తల నియామకం చేపడుతున్నామని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం శనివారం కోరారు. రూరల్ పరిధిలో 40, పట్టణ పరిధిలో 6 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 30 నుంచి జూలై 4వ తేదీ వరకు సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులను అందచేయాలని సూచించారు. ఖాళీల వివరాల కోసం స్థానిక ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో మెడికల్ ఆఫీసర్లను సంప్రదించాలని సూచించారు.

## బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



నారాయణస్వామి (ఫైల్)

బత్తలపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి నారాయణ స్వామి(22) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు ఏమిటో తెలియదని, విద్యార్థి తండ్రి ఆదినారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యార్థి ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడని తెలిపారు. కాసేపటి తరువాత గమనించిన కుటుంబ సభ్యులు.. చుట్టుపక్కలవారి సాయంతో కిందకు దించి.. బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తరించారని, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# ఫ్చ..!

# రైతుల ఆశలు నీరుగార్చిన భూ రీసర్వే

- సాగులో ఒకరు.. పాసు పుస్తకం మరొకరికి..
- పరిష్కారం కాని భూముల వివాదాలు
- రెవెన్యూ కార్యాలయం చుట్టూ అన్నదాతల ప్రదక్షిణ



కత్తివారిపల్లిలో సర్వే నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

గాండ్లపెంట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం ప్రారంభించిన రీసర్వే రైతుల ఆశలను నీరుగారుస్తోంది. సమస్యలు సక్రమంగా పరిష్కారం కాకపోవడం పట్ల అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పాలనలో ప్రారంభించిన ఈ రీసర్వేను కొనసాగించడానికి ప్రస్తుతం ప్రభుత్వం కూడా మొగ్గు చూపింది. దీంతో తమ భూ సమస్యలు ఇప్పుడైనా పరిష్కారం అవుతాయేమోనని రైతన్నలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

### సోమయాజులపల్లిలో ముగిసిన రీసర్వే

మండలంలోని సోమయాజులపల్లిలో ఆరు నెలల కిందట రీసర్వే కొనసాగించారు. సోమయాజులపల్లి రెవెన్యూ గ్రామంలోని సోమయాజులపల్లి, కత్తివారిపల్లి, ఎనుములవారిపల్లి, వేపలకుంట, బొల్లుగుంట్లపల్లి, ఎర్రచేనుపల్లి గ్రామాల్లో రీసర్వే నిర్వహించారు. సోమయాజులపల్లి రెవెన్యూ పరిధిలో 2027.63 ఎకరాలు ఉంది. ఈ భూమిలో రీసర్వే పూర్తయినట్లు అధికారులు నివేదికలు పంపారు. కానీ వెయ్యి ఎకరాల్లో కూడా పూర్తి స్థాయిలో రీ సర్వే ప్రక్రియ సాగలేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

### పరిష్కారం కాని సమస్యలు

తాము సాగు చేసుకుంటున్న భూములను వేరేవారు పాసు పుస్తకాల్లో నమోదు చేయించుకుని, పట్టాదారు పాసుపుస్తకాలు పొందినట్లు కొందరు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యలను రీ సర్వే అధికారులు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయితే భూములకు సంబంధించిన పత్రాలుంటేనే అంగీకరిస్తామని అధికారులు పేర్కొన్నట్లు రైతులు తెలిపారు. వంశపారంపర్యంగా అనుభవిస్తున్న తమ భూములకు ఎలాంటి పత్రాలు లేవు. అధికారం, పలుకుబడి ఉన్నవారు గతంలో పాసుపుస్తకాలు చేయించుకున్నారు. తమలాంటి వారు మాత్రం భూమిపై ఉంటూ సాగుచేసుకుంటున్నా, పాసుపుస్తకాలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను పరిష్కరించే అధికారే లేరంటు వాపోతున్నారు. ఇదే సమయంలో రీసర్వే జరగడంతో అధికారులు నిర్ణయించిన తేదీల్లో తమ భూముల కొలతలకు వెళ్లినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఉపయోగం ఏదీ?

రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూములను రీసర్వే చేయించి, హద్దులను కొలతలు వేసి, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. అయితే భూ కొలతల వేసే సమయంలో రైతుల భూ సరిహద్దులు చూపడంలో అటుఇటుగా ఉండంతో గొడవలకు దారితీశాయి. పాసుపుస్తకాలు లేని రైతులు భూమిని సాగుచేసుకుంటూ ముందుకెళ్తున్నారు. అదే భూమిని ఇతర రైతులు పాసుపుస్తకాలు చేయించుకోవడంతో గతంలో జరిగిన అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో రైతుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంతో సమస్యలు పరిష్కారం కావడం లేదు.

### అక్రమాలు వెలుగు చూసేనా?

సోమయాజులపల్లి రెవెన్యూ గ్రామంలో దాదాపు 884.24ఎకరాల్లో కొండలు, గుట్టల ప్రభుత్వ భూమి ఉంది.రస్తాలు, వాగు వంకలు ఉన్న భూమి 209.70 ఎకరాలు ఉంది. ఈ భూములను రైతులకు పంచకపోయినా వందలమందికి పట్టాదారు పాసు పుస్తకాలు చేయించినట్లు రెవెన్యూ అధికారులపై విమర్శలు ఉన్నాయి. కొందరు పలుకుబడి ఉన్న వారు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వ భూములకు పట్టాలు చేయించుకుని, సంక్షేమ పథకాలు పొందుతున్నారు. ఈ అక్రమాలు రీసర్వేలో వెలుగు చూస్తాయా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

### సమస్యలను పరిష్కరిస్తాం

ఇటీవల జరిగిన రీసర్వేలో భూసమస్యలు పరిష్కారం కాని రైతులు రెవెన్యూ కార్యాలయంలో వినతులు ఇవ్వాలి. మేము పరిశీలించి, పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటాం.

- బాబురావు, తహసీల్దార్, గాండ్లపెంట

### నిరాశే మిగిలింది



నాకు కత్తివారిపల్లి వద్ద సర్వేనెంబర్ 197, 198లో 2.2 ఎకరాల భూమి ఉంది. అందులో పంటలు సాగు చేసుకుంటున్నా. నా పేరుతో ఇంతవరకూ పాసు పుస్తకం లేదు. నా భూమిని ఇతరులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. దీన్ని సరి చేసి నా పేరుతో పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులు, కార్యాలయాల చుట్టు తిరుగుతున్నా. భూ రీసర్వేలో అయినా సమస్య తీరుతుందనుకుని ఆశపడితే నిరాశే మిగిలింది.

-సుధాకర్‌రెడ్డి, రైతు, కత్తివారిపల్లి



## దోపిడీ దొంగలు పాత నేరస్థులే..!

● పోలీసుల అదుపులో అనుమానితుడు



కారుపై వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్ (ఫైల్)

హిందూపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కిరికెర పంచాయతీ, వెంకటాద్రి లే అవుట్‌లోని నిత్యానంద రెడ్డి ఇంట్లో దోపిడీకి పాల్పడిన వారు పాత నేరస్థులని పోలీసులు గుర్తించారు. వీరిలో ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నటుల తెలిసింది. కారులో వచ్చిన ఐదుగురు దుండగులు నిత్యానందరెడ్డి ఇంట్లోకి గురువారం చొరబడి, కత్తులు, తుపాకీతో బెదిరించి దోపిడీ చేసిన విషయం తెలిసిందే. సుమారు 25 తులాల బంగారాన్ని దోచుకోవడంతో పోలీసులు ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. క్లూస్‌టీమ్‌ను గురువారం అర్ధరాత్రి పిలిపించి, బాధితుడి ఇంటి పరిసర ప్రాంతాలలో వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి, శుక్రవారం తెల్లవారుజాము నుంచే దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు ఎనిమిది బృందాలుగా విడిపోయి, మూడు రాష్ట్రాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. దుండగులు వచ్చిన కారు ఆధారంగా డీఎస్పీ మహేష్, సీఐ అంజనేయులు వేట ప్రారంభించారు. దొంగల కోసం వెళ్లిన ఓ బృందానికి శనివారం సాయంత్రానికి ఓ అనుమానితుడు పట్టుబడినట్లు సమాచారం. మిగిలినవారు ఎక్కడున్నారు, వారు ఎవరు అనేది తెలియాల్సి ఉంది. దుండగులు హిందీలో మాట్లాడుకున్నారని, ఉత్తరాదివారని బాధితులు పోలీసులకు చెప్పారు. పట్టుబడిన అనుమానితుడు జిల్లాకు చెందిన పాత నేరస్థుడని సమాచారం. మిగిలిన వారిని ఒకటి రెండు రోజుల్లో అదుపులోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

# ఆషాఢానికి చిక్కిన పట్టు

- నిలిచిన పట్టు చీరల విక్రయాలు
- నెలన్నర పాటు అరకొర అమ్మకాలే
- ముహూర్తాలు లేకపోవడమే కారణం
- ఇబ్బందుల్లో చేనేతలు, మాస్టర్ వీవర్స్



పది రోజుల నుంచి కొనేవారు లేక షాపులో నిల్వఉన్న పట్టుచీరలు



ధర్మవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆషాడం నేతన్న ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈనెలలో శుభముహూర్తాలు లేకపోవడంతో నేసిన చీరలు అమ్ముడుపోక ఇబ్బందిపడుతున్నారు. శుభముహూర్తాల సీజన్ వస్తే చాలు ధర్మవరంలో ప్రతి నెలా రూ.15 కోట్ల నుంచి రూ.20కోట్ల లావాదేవీలు జరుగుతుంటాయి. ప్రస్తుతం అన్‌సీజన్ కావడంతో రూ.5కోట్ల నుంచి రూ.10కోట్లలోపు కూడా క్రయ విక్రయాలు జరిగే పరిస్థితి లేదని చేనేత కార్మికులు, మాస్టర్‌వీవర్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### సంక్షోభంలో పరిశ్రమ

చేనేత పరిశ్రమలో నేతన్నల సంఖ్య తగ్గిపోవడం, గతంతో పోలిస్తే ఉత్పత్తి భారీగా పడిపోవడంతో నేతన్న చీరలకు డిమాండ్ పెరిగింది. 15 సంవత్సరాల కిందట చేనేత పరిశ్రమలో మంచి గిట్టుబాటు ఉండటం వల్ల అన్ని కులాలు, మతాల వారు ఈ చేనేత వృత్తిలోకి వచ్చారు. అప్పట్లో ముడిసరుకుల ధరలు కూడా నిలకడగా ఉండటం. పవర్‌లూమ్స్ చీరలు నామమాత్రంగానే ఉండటం వల్ల ప్రతి చేనేత కార్మికుడికి మంచి ఉపాధి దొరికేది. రానురాను ముడి సరుకుల ధరలు పెరగడం, అందుకు అనుగుణంగా చీరధర పెరగకపోవడంతో పట్టు పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. గతంలో జిల్లా వ్యాప్తంగా 75వేల మగ్గాలుండగా, ప్రస్తుతం 25 వేలలోపే ఉన్నాయంటే చేనేత పరిశ్రమ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ధర్మవరంలో దాదాపు 12వేల మగ్గాలు నడుస్తున్నారు. వారు కూడా పరిశ్రమపై దృష్టి సారించలేకపోవడం, పిల్లలను ఉన్నత చదువుల వైపు పంపడం, ఇతర వృత్తులు నేర్పించడం వల్ల మగ్గాల సంఖ్య ఇంకా తగ్గే అవకాశం ఉంది.

### భారీగా ఎగుమతులు

ధర్మవరంలో నేతన్న నేసిన చీరలు ఇతర రాష్ట్రాలకు భారీగా ఎగుమతి చేస్తుంటారు. ప్రధానంగా కర్ణాటక, ముంబై, కొయంబత్తూరు, కోల్‌కతా, బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్, చెన్నై తదితర నగరాలకు భారీగా ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం ఆషాడం నెల ప్రారంభమడం, శుభదినాలు లేకపోవడంతో మరో నెలన్నర రోజుల వరకు అన్ సీజన్ కొనసాగనుంది. అందుకే బడా వ్యాపారులు (మిగతా 6లో..)

## సార్.. అన్యాయం చేయొద్దు..!

- పశుసంవర్ధక శాఖ సహాయకుల నిరసన
- బదిలీల్లో నిబంధనలు పాటించాలని విన్నపం
- అంతా నా ఇష్టం అంటున్న జేడీ
- జిల్లా కలెక్టర్‌కు సంఘం నాయకుల ఫిర్యాదు



బదిలీల సమస్యలపై పశుసంవర్ధక శాఖ జేడీతో వాదిస్తున్న పశుసంవర్ధక సహాయకుల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి నిబంధనలు పాటించడం లేదని పశుసంవర్ధక సహాయకుల సంఘం నాయకులు ఆరోపించారు. స్థానిక పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయం వద్ద సంఘం ఆధ్వర్యంలో పలువురు పశుసంవర్ధక సహాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జేడీ చాంబర్‌లోకి వెళ్లి బదిలీల్లో అన్యాయం చేయడం సరికాదని (మిగతా 7లో...)

## రిక్వెస్టులలో వాస్తవమెంత?

- ఇష్టారాజ్యంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీలు
- ప్రతిభావంతులకు తీవ్ర అన్యాయం
- అధికారులతో నేతల వాగ్వాదం
- కౌన్సెలింగ్ వాయిదా



ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఈ

అనంతపురం న్యూటౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు సంబంధించి శనివారం నిర్వహించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ ఇష్టారాజ్యంగా సాగింది. స్పౌస్, మెడికల్ కేటగిరీల దరఖాస్తులను తనిఖీ చేయకపోవడంతో సమస్య మొదలైంది. కుప్పలుతెప్పలుగా రెక్వెస్టులు వచ్చాయి. నాయకుల సిఫార్సు లేఖలతో దీమాగా ఉన్నవారికి, ప్రతిభ ఉండి మొదటి ర్యాంకులో ఉన్నవారికి షాక్ తగిలింది. వీరిద్దరు పెట్టుకున్న ఆప్షన్లను రెక్వెస్టు కేటగిరీ వారు (మిగతా 7లో...)

## చేపల కోసం గొడవ

ఒకరికి గాయాలు

ధర్మవరం రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగిరెడ్డికుంట కొట్టాల వద్ద కుంటలో చేపల పంపకాల విషయంలో ఘర్షణ జరిగింది. రావులచెరువు, చిన్నూరు బత్తలపల్లి గ్రామాలకు చెందినవారు శుక్రవారం రాత్రి గొడవ పడ్డారు. పరస్పరం దాడి చేసుకోవడంతో రావులచెరువు గ్రామానికి చెందిన జనార్దన్ గాయపడ్డాడు. ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ, రూరల్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. రావులచెరువు గ్రామస్థులు గత ఏడాది డిసెంబరులో కుంటలో చేపలు వదిలారు. కుంటలో తమకు కూడా వాటా ఉందని చిన్నూరు బత్తలపల్లికి చెందిన పలువురు శుక్రవారం రాత్రి కుంటవద్దకు కాపలాగా వచ్చారు. అదే సమయానికి రావులచెరువుకు చెందిన జనార్దన్, మరో ముగ్గురు కుంట వద్దకు వెళ్లారు. చేపల విషయంలో ఇరువర్గాలకు వాగ్వాదం జరిగి, ఘర్షణకు దిగారు. చిన్నూరు బత్తలపల్లికి చెందిన చిన్న లింగమయ్య, శ్రీరాములు, అక్కులప్ప, గణేష్, నాగభూషణ, గంగన్న తనను కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారని, సెల్‌ఫోన్‌ను లాక్కెల్లారని జనార్దన్‌లో ఫిర్యాదులో పేర్కొన్నాడు. రూరల్ పోలీసులు విచారిస్తున్నారు.

# విద్యాశాఖ భ్రష్టు..!

- అసంబద్ధ నిర్ణయాలతో ఇబ్బందులు
- 'మోడల్' పేరుతో పాఠశాలల స్థాయి తగ్గింపు
- ఇబ్బందిపడుతున్న విద్యార్థులు

తనకల్లు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అసంబద్ధ నిర్ణయాలతో విద్యాశాఖ భ్రష్టు పడుతోందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇదివరకు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల స్థాయిని మోడల్ ప్రైమరీ స్కూల్ పేరుతో తగ్గించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని టి.సదుం, చీకటిమానుపల్లి, దేవళంతండా, తనకల్లులో ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలుండేవి. వీటన్నింటిని మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా మార్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో ఆపాఠశాలల స్థాయి తగ్గిపోయింది. నిబంధనల మేరకు వీటి ఏర్పాటుకు కనీసం 45మంది పిల్లలు ఉండాలి. ప్రతి తరగతికి ఒక్కో ఉపాధ్యాయుడు ఉండేలా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కొన్ని మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో 45మంది విద్యార్థులు లేనట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో కొందరు ఉపాధ్యాయులు ఈ పాఠశాలలకు వచ్చారు. అయితే 45మంది పిల్లలు లేరని ఆ ఉపాధ్యాయులను హేతుబద్ధీకరణ పేరుతో నెల కూడా తిరగకుండానే మరో పాఠశాలలకు బదిలీ చేస్తారని సమాచారం.

### ఏకోపాధ్యాయ పాఠశాలలు 40కి పైనే...

మండలంలో 40కిపైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. ఎంటీఎస్ ఉపాధ్యాయులు 13మంది పని చేసేవారు. వారిని ఇటీవల ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. దీంతో ఈఏడాది ఇద్దరే మండలంలో మిగిలారు. మండలంలోని టి.సదుం గ్రామంలో 43మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారు. అంతమంది పిల్లలకు బోధన కష్టంగా మారిందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లీడర్‌షిప్ ట్రైనింగ్, ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్‌ల పేరుతో ప్రతి పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయుడు లేదా 1, 2 తరగతులకు బోధించే ఉపాధ్యాయులను కదిరి, పుట్టపర్తి కేంద్రాలకు తరచూ వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఉపాధ్యాయులు శిక్షణ కోసం వెళ్తే ఏకోపాధ్యాయ పాఠశాలల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





టి.సదుం ప్రాథమిక పాఠశాల (బోర్డుకే ప్రాథమికోన్నత పాఠశాల)

### విద్యార్థులు తక్కువగా ఉండటం వల్లే..

విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో, ఆయాపాఠశాలల యజమాన్య కమిటీలు, ఉపాధ్యాయులు నిర్ణయాల మేరకే ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా మార్పు చేశాం. ఆపాఠశాలల నుంచి హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు నెలకు రూ.500 రవాణా ఖర్చులు ప్రభుత్వమే చెల్లిస్తుంది. -క్రిష్టప్ప, డీఈఓ

# విద్యార్థులకు ఆర్టీసీ ఆసరా

**పల్లె వెలుగు బస్సుల్లో ఉచిత, రాయితీ పాసులు**



ధర్మవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థలు తెరుచుకున్నాయి. పట్టణాల్లోని విద్యాసంస్థలకు వెళ్లేందుకు గ్రామీణ ప్రాంత పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రయాణ ఖర్చు భారంగా మారుతోంది. అటువంటి విద్యార్థులకు ఏపీఎస్ఆర్టీసీ అందిస్తున్న రాయితీ పాస్‌లు వరంగా మారాయి. 10వ తరగతిలోపు చదువుతున్న విద్యార్థినులు, 12 సంవత్సరాలలోపు విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇంటర్, ఆపై చదువుకుంటున్న విద్యార్థులకు రాయితీ పాసులు ఇస్తున్నారు. ఆర్టీసీలో రాయితీ పాసులు పొంది ప్రయాణిస్తున్న విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా నగదు చెల్లిస్తుంది.

## దరఖాస్తు ఇలా..

ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుల్లో ఉచిత, రాయితీతో ప్రయాణించాలంటే విద్యార్థులు ముందుగా పాస్‌లు పొందాలి. ఆయా బస్టాండ్లలోని బస్సు పాస్ కౌంటర్లలో వాటిని జారీ చేస్తారు. ఉచిత పాస్‌లు పొందాలనుకునే వారు ఆధార్‌కార్డు, పాఠశాలలో హెచ్ఎం ఇచ్చే స్టడీ సర్టిఫికెట్‌తో కౌంటర్ వద్దకెళ్లాలి. రాయితీ పాస్‌లకు ఇంటర్ విద్యార్థులు ఆధార్‌కార్డు, పదో తరగతి హాల్ టికెట్, దరఖాస్తుతోపాటు జతచేయాలి. ఆపై తరగతులు చదివేవారు ఆయా విద్యాసంస్థల ప్రిన్సిపాళ్ల సర్టిఫికెట్లు అందజేయాలి. వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. 5 కిలోమీటర్ల పరిధి నుంచి 50 కిలోమీటర్ల వరకు రాయితీ పాస్‌లను ఆర్టీసీ అందిస్తోంది. గతంలో నెలకోసారి విద్యార్థులు పాస్‌లను రెన్యూవల్ చేసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు నెలకు, మూడునెలల వరకు కూడా పొందవచ్చు.

**రాయితీ పాసుల రుసుము వివరాలిలా..**

| దూరం (కి.మీ) | నెలకు (రూ.లలో) | 3 నెలలకు (రూ.లలో) |
|---|---|---|
| 0-5 | 140 | 400 |
| 5-10 | 190 | 555 |
| 10-15 | 240 | 705 |
| 15-20 | 315 | 930 |
| 20-25 | 400 | 1,185 |
| 25-30 | 435 | 1,290 |
| 30-35 | 475 | 1,410 |
| 35-40 | 565 | 1,680 |
| 40-45 | 645 | 1,920 |
| 45-50 | 735 | 2,190 |

# సత్యసాయి ప్రేమతత్వంతో వైద్యసేవలు

**వైట్ ఫీల్డ్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సుందరేశ్**

పుట్టపర్తి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సత్యసాయి ప్రేమతత్వంతో కూడిన వైద్యసేవలు అందిస్తున్నామని వైట్‌ఫీల్డ్‌లోని శ్రీసత్యసాయి సూపర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సుందరేశ్ పేర్కొన్నారు. స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో శనివారం శ్రీసత్యసాయి హెల్త్ కేర్ గ్లోబల్ కౌన్సిల్ నిర్వహించారు. వైట్‌ఫీల్డ్ ఆస్పత్రి డైరెక్టర్ మాట్లాడుతూ... సత్యసాయి ప్రేమతత్వంతో పేద, ధనిక, కులమత బేధాలు లేకుండా అందరికీ ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. అనంతరం సత్యసాయి హెల్త్‌కేర్ పుస్తకాన్ని ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్.. సభ్యులు నాగానందం, డాక్టర్ మోహన్‌తో కలిసి ఆవిష్కరించారు. వైద్యసేవలను మరింత విస్తరించేందుకు చికాగో, టోక్యో హెల్త్ యూనివర్సిటీలతో ఎంఓయూలు చేసుకున్నట్లు ప్రకటించారు. అనంతరం వైద్యబృందం గాన కచేరి నిర్వహించింది. సదస్సులో ప్రశాంతిగ్రామం, వైట్‌ఫీల్డ్ ఆస్పత్రి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



హెల్త్‌కేర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ట్రస్టుసభ్యులు





చేనేత కార్మికుడు నేసిన పట్టుచీర

# ఆషాఢానికి చిక్కిన పట్టు

(5వ పేజీ తరువాయి)

చేనేతల నుంచి తయారు చేసిన చీరలను తెప్పించుకుని, సీజన్ రాగానే వాటిని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

### మామూలు రోజుల్లో అంతంతమాత్రమే..



పవర్‌లూమ్స్ విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తుండటంతో మామూలు రోజుల్లో కూడా మేము నేసిన చీరలకు అంతంత మాత్రమే డిమాండ్ ఉండేది. ఇప్పుడు ఆషాఢం రావడంతో కొనేవారి సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. వీటి వల్ల మాస్టర్ వీవర్స్ పూర్తి స్థాయిలో పనులు కల్పించకపోవడం వల్ల పొట్ట కూటికోసం మరో నెలన్నర పాటు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి తప్పడంలేదు. ఇలాంటి అన్‌సీజన్ సమయాల్లో పనులు లేక ఇబ్బందులు పడుతున్న చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి.

**- జింకా కేశవ, చేనేత కార్మికుడు**

### వెంటాడుతున్న అన్‌సీజన్



గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదారు సంవత్సరాల నుంచి చేనేత పరిశ్రమను సీజన్, అన్‌సీజన్ వెంటాడుతున్నాయి. ప్రస్తుతం అన్‌సీజన్ రావడంతో ఉత్పత్తులు భారీగా పెరిగిపోతుండటంతో మాస్టర్ వీవర్స్ ఆర్థికంగా ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంటోంది. దీంతో మా లాంటికార్మికులకు పూర్తి స్థాయిలో పనులు అప్పగించలేని పరిస్థితి ఏర్పడుతోంది. మళ్లీ సీజన్ రావడానికి దాదాపు నెలన్నర రోజులు పాటు నిరీక్షించాల్సిన పరిస్థితి రావడం మా దౌర్భాగ్యమే.

**-శ్రీనివాసులు, చేనేత కార్మికుడు**

# చదువులకు చేయూత

- డ్వాక్రా మహిళల పిల్లలకు ప్రయోజనం
- 'ఎన్టీఆర్ విద్యాసంకల్పం' అమలుకు శ్రీకారం
- త్వరలో ప్రారంభించనున్న సీఎం



మహిళా సంఘాల సభ్యులు

అనంతపురం అర్బన్/ఉరవకొండ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల పిల్లల చదువులకు భరోసానిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తపథకానికి రూపకల్పన చేసింది. ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకంలో భాగంగా స్త్రీనిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ ద్వారా రుణం మంజూరు చేయాలని నిర్ణయించింది. అందుకు సంబంధించిన విధివిధానాలను ఇప్పటికే సిద్ధం చేసింది. ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకాన్ని సీఎం చంద్రబాబునాయుడు త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న పథకం ద్వారా డ్వాక్రా మహిళల పిల్లల చదువులకు చేదోడు లభించనుంది. విద్యావికాసానికి దోహదపడేందుకు 35 పైసల వడ్డీతో స్త్రీనిధి రుణాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకానికి ఎన్టీఆర్ విద్యా సంకల్పంగా నామకరణం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం ద్వారా ప్రతి ఏడాది రూ.200కోట్లు ఖర్చు చేసే విధంగా విధివిధానాలను రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా 31 మండల సమాఖ్యలు, 35,561 స్వయం సహాయక సంఘాలు, 1330 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. వీటిలో 3,55,550 మంది సభ్యులు ఉన్నారు. ఈ ఏడాది ఈ పథకం ద్వారా రూ.20 కోట్ల రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించారు. తద్వారా జిల్లాలోని రెండు వేల మందికిపైగా డ్వాక్రా మహిళల పిల్లలకు లబ్ధిచేకూరనుంది.

### పథకం వర్తించేదిలా..

ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకం ద్వారా డ్వాక్రా మహిళల పిల్లల చదువుల కోసం 35 పైసలు వడ్డీతో రెండు నుంచి మూడు సంవత్సరాల కాల వ్యవధిలో తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. ఒకటో తరగతి నుంచి పీజీ వరకు, ఇతర రకాల కోర్సులు చదివే డ్వాక్రా మహిళల పిల్లలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, కళాశాలల్లో చదివే విద్యార్థులైనా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. ఈ రుణాలను పూర్తిగా పిల్లల చదువుల కోసం వినియోగించాల్సి ఉంటుంది. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, సాంకేతిక విద్యాసామాగ్రి, విద్యార్థులకు కావాల్సిన ఇతర సామాగ్రిని కొనుగోలుకు రుణాన్ని ఖర్చు చేయాలన్న నిబంధన విధించారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు సైకిళ్లను కూడా కొనుగోలు చేసుకోవచ్చు. పిల్లల చదువుల కోసం ఖర్చుపెట్టిన వివరాలకు సంబంధించి తగిన రసీదులను స్త్రీనిధి అధికారులకు అందించాల్సి ఉంటుంది. డ్వాక్రా సంఘాల్లోని సభ్యులందరూ పథకానికి అర్హులు. వారి పిల్లల అవసరానికి అనుగుణంగా రూ.10వేల నుంచి రూ. లక్ష వరకూ స్త్రీ నిధి ద్వారా రుణాలు అందించాలని నిర్ణయించారు.



### పేద కుటుంబాలకు ఊరట



స్త్రీనిధి పథకం ద్వారా పిల్లల చదువుకు రూ.లక్ష దాకా రుణం పొందే అవకాశం కల్పించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించడం సంతోషంగా ఉంది. పిల్లల చదువు కోసం ఈ కొత్త పథకం ఉపయోగపడుతుంది. ఇద్దరు పిల్లలను ప్రైవేట్ స్కూల్లో చదివిస్తున్నాం. బయట వడ్డీలకు తెచ్చి పిల్లలను చదివించుకునే మాలాంటి వారికి ఈ పథకం ఎంతగానో ఉపయోగం. 35 పైసల వడ్డీకే రూ.లక్ష వరకు రుణం ఇవ్వాలని సీఎం నిర్ణయం తీసుకోవడంతో పేద కుటుంబాలకు ఊరట లభిస్తుంది.

**-మంజుల, డ్వాక్రా సభ్యురాలు, రాచేపల్లి, ఉరవకొండ మండలం**

### సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం



ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకం ద్వారా పిల్లల చదువులకు రుణాలిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బాగుంది. ఇప్పటికే తల్లికి వందనం పథకం ద్వారా ఎంతమంది పిల్లలు ఉన్నా ఇస్తున్నారు. పేద కుటుంబాల్లోని పిల్లల చదువుల కోసం తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కల్పిస్తున్న సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం. పేద కుటుంబాలకు ఈ పథకం భరోసా కల్పిస్తుంది.

**-సునీత, మోపిడి, ఉరవకొండ మండలం**

### పేద విద్యార్థులకు ఉపయోగం



రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యకు చేయూతనిచ్చేందుకు ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకానికి శ్రీకారం చుట్టింది. గతంలో స్త్రీనిధి ద్వారా డ్వాక్రా సంఘాల సభ్యులకు రుణాలు ఇచ్చేవారు. ఈసారి ఆ తరహా రుణాలతోపాటు, డ్వాక్రా మహిళల పిల్లల చదువు కోసం ప్రత్యేకంగా రుణ సదుపాయం కల్పించాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారు. అవసరానికి అనుగుణంగా రూ.10వేల నుంచి రూ. లక్ష వరకూ స్త్రీ నిధి ద్వారా రుణాలు అందించాలని నిర్ణయించారు. కేవలం 35పైసల వడ్డీతో 2 నుంచి 3 సంవత్సరాల కాల వ్యవధిలో తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించే వెసులుబాటు కల్పించారు. ఒకటో తరగతి నుంచి పీజీ వరకు, ఇతర రకాల కోర్సులు చదివే డ్వాక్రా మహిళల పిల్లలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తాం.

**-శైలజ, పీడీ, డీఆర్‌డీఏ**

# సస్య రక్షణతోనే అధిక దిగుబడి

**• వ్యవసాయ అధికారి పెన్నయ్య**



హెచ్ పెన్నయ్య, వ్యవసాయ అధికారి

విడపనకల్లు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో రైతులు కంది సాగుకు సిద్ధం అవుతున్నారు. సస్య రక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని విడపనకల్లు వ్యవసాయ అధికారి హెచ్ పెన్నయ్య పేర్కొన్నారు. పంట సాగులో విత్తు సమయం నుంచి దిగుబడి వచ్చే వరకూ రైతులు ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి అనే అంశాలపై ఆయన వివరించారు.

**ప్రశ్న: కంది సాగుకు ఎటువంటి నేలలు అనుకూలం?**
**జవాబు:** నీరు త్వరగా ఇంకి పోయే ఎర్ర నేలలు, గరుసు నేలలు, నీరు పారే వసతి గల నల్లరేగడి నేలలు కంది పంట సాగు చేయుటకు అనుకూలం.

**ప్రశ్న: ఏకాలంలో సాగు చేస్తే కంది దిగుబడి బాగా వస్తుంది?**
**జవాబు:** జూన్ నెల నుంచి జూలై నెల చివరి వరకూ కంది పంటను సాగు చేయవచ్చు. అది కూడా తక్కువ వర్షం ఉన్న సమయంలో విత్తనం వేయాలి. జూన్, జూలై నెలల్లో విత్తనం సాగు చేస్తే మంచి దిగుబడి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

**ప్రశ్న: ఏ రకం విత్తనాలు మంచి దిగుబడి ఇస్తాయి?**
**జవాబు:** ఎల్ ఆర్‌జీ-52, ఎల్ఆర్‌జీ-105, ఆశ (ఐసీపీఎల్87119) అనే రకాలు మన నేలకు అనుకూలమైనవి. వీటి పంట కాలం 170 నుంచి 180 రోజులు.

**ప్రశ్న: ఎకరాకు ఎన్ని కిలోల విత్తనం వేయాలి ?**
**జవాబు:** ఎకరాకు 4 నుంచి 6 కిలోలను విత్తుకోవాలి. వ్యవసాయాధికారుల సలహా మేరకు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి. పంటకు తెగుళ్లు ఆశించకుండా తగిన సస్యరక్షణ చర్యలు పాటించాలి.

**ప్రశ్న: సాలుకు సాలుకు మధ్య ఎంత దూరం ఉండాలి?**
**జవాబు:** నల్ల రేగడి నేలలో అయితే సాలుకు సాలుకు మధ్య దూరం 180 సెంటి మీటర్లు, మొక్కకు మొక్కకు 20 సెంటి మీటర్లు దూరం ఉండాలి. ఎర్ర నేలల్లో అయితే సాలుకు సాలుకు 90 సెంటీ మీటర్లు దూరం, మొక్కకు మొక్కకు 20 సెంటి మీటర్లు దూరం ఉండేలా విత్తనాన్ని సాగు చేయాలి.

# ఉనికి కోసమే వైసీపీ వెంపర్లాట

**• ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు**

అనంతపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న నేపథ్యంలో... ప్రజల్లో ఉనికి కోల్పోతామేమోనన్న భయంతో వైసీపీ నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారని ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి ఎద్దేవా చేశారు. వైసీపీ నేతల విమర్శలపై టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డితో కలిసి శనివారం ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రజలు చక్కగా పాలన చేయమని అధికారమిస్తే.. ఐదేళ్లు దోచుకోవడం, దాచుకోవడమే ధ్యేయంగా వైసీపీ నాయకులు పనిచేశారని విమర్శించారు. ఆ అవినీతి కేసుల్లో ఒక్కొక్కరుగా వైసీపీ నాయకులు జైళ్లకు వెళ్తున్న పరిస్థితుల్లో ప్రజల్లో చులకన అవుతామేమోనన్న భయం ఆ పార్టీ నాయకులకు పట్టుకుందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. తమ మా నాయకుడు లోకేశ్ రెడ్‌బుక్ ప్రస్తావన లేకుండా రోజు గడవని పరిస్థితుల్లో వైసీపీ నాయకులు ఉన్నారని ఎద్దేవా చేశారు. ఎవరి ప్రభుత్వ హయాంలో రక్షణలేకుండా పోయిందో ప్రజలకు తెలిసే వైసీపీకి ప్రతిపక్ష హోదాకూడా ఇవ్వలేదన్నారు. ఈ విషయాన్ని వైసీపీ నాయకులు గుర్తుపెట్టుకుని మాట్లాడితే మంచిదని ఆయన హితవు పలికారు.

# పెద్దపప్పూరు ఘటనపై ఎస్పీ విచారణ

అనంతపురం క్రైం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పెద్దపప్పూరు ఘటనపై విచారణ చేయిస్తున్నట్లు జిల్లా ఎస్పీ జగదీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపప్పూరు యువకుడు వంశీని పోలీసులు కొట్టినట్లు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న ఘటనపై విచారణకు ఆదేశించిన ట్లు పేర్కొన్నారు. విచారణాధికారిగా తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఆ ఘటనపై సమగ్రం గా విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కోరారు. విచారణ నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

# జాకీ పోయె.. రేమండ్ వచ్చె..!

- రాప్తాడు వద్ద కంపెనీ ఏర్పాటుకు ముందుకొచ్చిన సంస్థ
- 3 వేల మందికి ఉపాధి
- రాప్తాడును పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచక పాలనలో తెలంగాణకు తరలిపోయిన జాకీ పరిశ్రమ స్థానంలో.. రేమండ్ సంస్థ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. రాప్తాడు నియోజకవర్గ అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి.. జాకీ ప్రతినిధులను కాసులకోసం బెదిరించిన నేపథ్యంలోనే.. ఆ సంస్థ తెలంగాణకు తరలిపోయిందన్న ఆరోపణలు వినిపించాయి. అధికార మార్పిడి నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడం, రాప్తాడు నియోజకవర్గం నుంచి పరిటాల సునీత విజయం సాధించిన విషయం తెలిసిందే. పరిటాల సునీత ఎన్నికల ప్రచారంలో భాగంగా... జాకీ పరిశ్రమ స్థానంలో మరొకటి తీసుకొచ్చి వేలాదిమందికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. దానిని నిలబెట్టుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో జాకీ పరిశ్రమ స్థానంలో రేమండ్ సంస్థ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం శుభపరిణామం. రూ.330 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. తద్వారా దాదాపు 3వేల మందికి ఉపాధి లభించనుంది. దీంతో రాప్తాడు నియోజకవర్గ పారిశ్రామిక అభివృద్ధికి అడుగులు పడినట్లయిందనడంలో సందేహం లేదు.

### 26.87 ఎకరాల్లో...

రాప్తాడు వద్ద 26.87 ఎకరాల్లో రేమండ్ సంస్థ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. ఎకరా రూ.20 లక్షల చొప్పున కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు కోసం స్థిర మూలధన పెట్టుబడి కింద రూ.330 కోట్లను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు దానిపై ప్రోత్సాహకాలు చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ పరిశ్రమ ఏర్పాటుద్వారా ప్రత్యక్షంగా 3వేల మందికి, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభించనుంది. ఇటీవల దాదాలూరు వద్ద ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించారు. ఆ ప్రాంతానికి మరికొన్ని కంపెనీలు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

### మాట నిలబెట్టుకున్నాం



ఎన్నికల హామీ మేరకు జాకీ స్థానంలో ప్రఖ్యాత గార్మెంట్ పరిశ్రమ రేమండ్‌ను తీసుకొచ్చాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు నియోజకవర్గ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో రాప్తాడు సమీపంలో జాకీ పరిశ్రమ ఏర్పాటుకు ఆ సంస్థ ముందుకొచ్చింది. పనులు ప్రారంభించారు. తర్వాత ఎన్నికలు రావడం.. వైసీపీ ప్రభుత్వంలోకి రావడం జరిగిపోయాయి. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అతని సోదరులు జాకీ సంస్థను బెదిరించడంతో.. తెలంగాణకు వెళ్లిపోయింది. మరో గార్మెంట్ సంస్థను తీసుకొస్తామంటూ ఐదేళ్లు తోపు కుటుంబం కాలం గడిపింది. జాకీ పరిశ్రమను తిరిగి రప్పించడంగానీ, అదే స్థానంలో మరొకటి తీసుకొస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. దానిని నిలబెట్టుకున్నాం. చెన్నే కొత్తపల్లి ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు 4వేల ఎకరాలు అనువైన భూమి ఉంది. అక్కడి రైతులను ఒప్పించి మరిన్ని పరిశ్రమలు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఓవైపు హంద్రీనీవా ద్వారా నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తూనే.. మరోవైపు పారిశ్రామికీకరణ దిశగా అడుగులు వేస్తున్నాం.

**- ఎమ్మెల్యే పరిటాల సునీత**

# ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్

అనంతపురం రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాలిసెట్-2025 కౌన్సెలింగ్ ముగిసింది. అనంతపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు, కళ్యాణదుర్గం, తాడిపత్రి, హిందూపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ ప్రక్రియ సాగింది. చివరి రోజు శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 336మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. ఈనెల 21 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. చివరి రోజు వరకు 2712మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌లో తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. ఎవరైనా సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోకపోతే వారు ఆప్షన్ ఎంట్రీ తేదీల్లో హెల్ప్ లైన్ సెంటర్‌ను సంప్రదించవచ్చునన్నారు. ఆప్షన్ల ప్రక్రియ తేదీ త్వరలోనే వెలువడుతుందన్నారు.

# బతుకుపై భరోసా..

**కుట్టు శిక్షణకు విశేష స్పందన**

**మహిళల్లో పెరిగిన ఆత్మవిశ్వాసం**

ఒక యేడు అతివృష్టి, మరో యేడు అనావృష్టి.. పంటలు వేసిందే తప్ప.. చేతికొచ్చింది లేదు. లాభాలు చూసిందీ లేదు. నష్టాలే రాబడి.. అప్పులే మిగులుబడి.. ఇల్లు గడవాలన్నా కష్టమే.. పిల్లల చదువులు, పెళ్లిళ్లు తలచుకుంటే భయమేసేది.. బతుకే బెంగ.. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఇస్తున్న కుట్టు శిక్షణకు మహిళలు ఆసక్తి చూపారు.. ఇలాగైనా బతికే మార్గం దొరుకుతుందేమోననుకున్నారు.. శిక్షణ పూర్తి దశకు చేరుకున్నాక.. వారికి ఎనలేని ధైర్యం వచ్చింది. కుట్టు మిషన్‌తో బతికేయగలమన్న నమ్మకం పెరిగింది.. కుట్టుశిక్షణ బతుకుపై భయాన్ని పోగొట్టి.. ఆత్మవిశ్వాసం నింపిందని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు..

పెనుకొండ టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మహిళలకు స్వయం ఉపాధి కల్పించడం ద్వారా వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇస్తున్న కుట్టు శిక్షణ వారిలో బతుకుపై భరోసా కల్పిస్తోంది. మహిళలకు సమాజంలో సరైన అవకాశం లేకపోవడం, చదువుకున్నా ఉద్యోగం లేకపోవడం, కుటుంబ బాధ్యతలు వంటి కారణాలతో ఇంటికే పరిమితం అవుతున్నారు. అటువంటి వారికి ఉపాధి కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునివ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలకు కుట్టుశిక్షణ ఇస్తోంది. పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్‌తోపాటు కుట్టుమిషన్ ఉచితంగా అందజేయనుంది. కుట్టుశిక్షణకు మహిళల నుంచి మంచి స్పందన వస్తోంది. శిక్షణ పూర్తి చేసుకుని ఇంటి వద్దే జీవనోపాధి పొందుతామని మహిళలు అంటున్నారు.

### ఉమ్మడి జిల్లాలో 18 వేల మందికి..

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 18 వేల మంది మహిళలు ఉచితంగా కుట్టుశిక్షణ పొందుతున్నారు. ఉమ్మడి జిల్లాల్లో 80 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తున్నారు. 90 రోజుల ఈ శిక్షణ ముగింపు దశకు చేరుకుంది. దీంతో మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. గ్రామంలో కుట్టుమిషన్ ఏర్పాటు చేసుకుని, ఉపాధి పొందగలమంటున్నారు. తద్వారా కుటుంబ ఖర్చులు భరించగలమని సంతోష పడుతున్నారు.

### ధైర్యం వచ్చింది..



ఉచిత కుట్టు శిక్షణతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. చాలీచాలని ఆదాయంతో ఇబ్బందులు ఉంటాయి. కూటమి ప్రభుత్వం కుట్టు మిషన్‌పై శిక్షణ ఇవ్వడంతోపాటు ఉచితంగా కుట్టుమిషన్లు అందించడం సంతోషంగా ఉంది. శిక్షణతో సొంతకాళ్లపై నిలబడగలమన్న ధైర్యం వచ్చింది.

**- నాజియా, దర్గాపేట, పెనుకొండ**





కుట్టుమిషన్‌పై మంత్రి సవిత (ఫైల్), పెనుకొండలో శిక్షణ పొందుతున్న మహిళలు

### ఇంటి బాధ్యతలో నా వంతుగా..



ఇంటి ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఇవి భారమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కుట్టు శిక్షణ పూర్తి చేసుకోవడం ఎంతో ఉపశమనం. గ్రామంలో టైలరింగ్ సెంటర్ ఏర్పాటు చేసుకుంటా. తద్వారా వచ్చిన ఆదాయాన్ని ఇంటి ఖర్చులు, అభివృద్ధికి వినియోగిస్తా.

**- అరుణ, వెంకటరెడ్డిపల్లి, పెనుకొండ మండలం**

### విశేష స్పందన



కూటమి ప్రభుత్వంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు నాయుడు ఈ ఏడాది మార్చిలో ఉచిత కుట్టుశిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ 15న శిక్షణ కేంద్రాలను ప్రారంభించాం. పెద్దఎత్తున మహిళలు వచ్చారు. జూలై మొదటి వారానికి శిక్షణ పూర్తవుతుంది. పూర్తి చేసుకున్న ప్రతి మహిళకు ఉచిత కుట్టుమిషన్‌తోపాటు సర్టిఫికెట్ అందిస్తాం. కుట్టుశిక్షణతోనే ఆగిపోకుండా కంప్యూటర్ డిజైన్ తదితర వాటిపై నైపుణ్యం సాధించి, మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి. వాటన్నింటికీ ప్రభుత్వం అండగా ఉండి రుణాలు అందిస్తుంది.

**- సవిత, బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి**

## గుత్తి మీదుగా తిరుపతికి ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నాందేడ్-తిరుపతి మధ్య (వయా గుత్తి) వచ్చే నెలలో ఓ వీక్లీ ఎక్స్‌ప్రెస్ నడపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ప్రకటనలో తెలిపారు. నాందేడ్-తిరుపతి ప్రత్యేక రైలు (నం 07015) జూలై 5 నుంచి 26వ తేదీ వరకూ నాందేడ్‌లో ప్రతి శనివారం సాయంత్రం 4.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.10 గంటలకు తిరుపతి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07016) జూలై 6 నుంచి 27వ తేదీ వరకూ ప్రతి ఆదివారం సాయంత్రం 4.40 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.15 గంటలకు నాందేడ్‌కు చేరుకుంటుందని తెలియజేశారు. ఈ రైలు ముడ్‌ఖేడ్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా వెళ్తుందని వివరించారు.

## టమోటా మార్కెట్ ప్రారంభం

● మండీలకు వస్తున్న కాయలు

● పది, పదిహేను రోజుల్లో పూర్తిస్థాయిలో వచ్చే అవకాశం

అనంతపురం రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్ ప్రారంభమైంది. ఇటీవల మార్కెట్‌లోని మండీల యజమానులు మంచి రోజులు చూసుకుని మండీలను ప్రారంభించుకున్నారు. టమోటా సీజన్ ప్రారంభం అవుతుండటంతో ఆ మేరకు మండీల యజమానులు మండీలను అన్నివిధాలా సిద్ధం చేసుకుంటున్నారు. కాయల ఎగుమతి, దిగుమతులకు క్రేట్‌లు కొనుగోలు చేసుకుంటున్నారు. ఇప్పటికే కొన్ని మండీల నిర్వాహకులు వ్యాపార లావాదేవీలు ప్రారంభించేశారు. వివిధ ప్రాంతాల నుంచి చిన్న.. చిన్న కాయలు మార్కెట్‌కు వస్తుండటంతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో 30కిపైగా మండీలు ఉన్నాయి. సగం మండీల్లో కాయలు కొనుగోలు చేస్తున్నారు. ఆయా మండీలకు 15వేల బాక్సులకుపైగానే కాయలు వస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. మరో పది, పదిహేను రోజుల్లో కాయల రాక మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

## నెల్లూరుపై అనంత జట్టు విజయం

అండర్-19 మల్టీడే క్రికెట్ పోటీల్లో సెంచరీల మోత



జయంత్ కృష్ణ



వీరారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అనంత బ్యాటర్లు సెంచరీల మోత మోగించడంతో నెల్లూరుపై అనంతపురం జట్టు ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-19 మల్టీడే క్రికెట్ పోటీలు కడపలో నిర్వహించారు. మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 50.4ఓవర్లలో 212 పరుగులకే ఆలౌట్ అయ్యింది. తర్వాత తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 77ఓవర్లలో 524 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జిల్లా బ్యాటర్లు జయంత్‌కృష్ణ 221, వీరారెడ్డి 157 పరుగులు సాధించారు. రెండో ఇన్నింగ్స్‌లో నెల్లూరు 99.2 ఓవర్లలో 405పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్ కారుణ్య ప్రసాద్ 135, సాహిల్ హమీద్ 89పరుగులు చేశారు. 94పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అనంత రెండో ఇన్నింగ్స్‌లో 24.3ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

## ప్రాబబుల్స్‌కు ఇద్దరు మహిళా క్రికెటర్లు



చక్రిక, హిమవర్షిణిని అభినందిస్తున్న సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అండర్-19 రాష్ట్ర మహిళా జట్టు ప్రాబబుల్స్‌లో జిల్లాకు చెందిన చక్రిక, హిమవర్షిణి చోటు దక్కించుకున్నారు. వీరు తపోవనం క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. జూలై రెండు నుంచి జరిగే పోటీల్లో పాల్గొనే ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికయ్యారు. వీరిని తపోవనం క్రికెట్ అసోసియేషన్ సభ్యులు మనోజ్, మదన్‌మోహన్ రెడ్డి, రాయల్‌మురళి అభినందించారు.

## మెగా పేరెంట్స్ మీటింగ్ వాయిదా

అనంతపురం విద్య, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో జూలై 5న నిర్వహించ తలపెట్టిన మెగా పేరెంట్స్ మీటింగ్ తాత్కాలికంగా వాయిదా పడింది. ఇప్పటికే ఈ మీటింగ్ నిర్వహణకు శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు చేస్తున్న విషయం విదితమే. కార్యక్రమానికి సీఎం చంద్రబాబునాయుడు హాజరవుతారని అక్కడ అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. జూలై 5న మొహరం పండుగ నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు మెగా పేరెంట్స్ మీటింగ్‌కు హాజరుకావడం కష్టమని రాయలసీమ ప్రాంత టీచర్ల సంఘాలు, అధికార పార్టీ నాయకులు విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసికెళ్లారు. దీంతో సమావేశాన్ని వాయిదా వేశారు. ఇదే విషయాన్ని విద్యాశాఖ, ఎస్ఎస్ఏశాఖల అధికారులకు రాష్ట్ర కమిషనర్ విజయరామరాజు వీడియో కాన్ఫరెన్స్‌లో తెలియజేశారు. విషయాన్ని డీఈఓ ప్రసాద్‌బాబు, ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ వెల్లడించారు. అయితే ఈమీటింగ్ జూలై 9లేదా పదో తేదీన ఉండొచ్చనే అభిప్రాయాలు విద్యాశాఖ వర్గాల్లో వ్యక్తం అవుతున్నాయి.

## చీనీ టన్ను రూ.27వేలు

అనంతపురం రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.27,690 అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.13వేలు, సరాసరి రూ.18వేలు విక్రయాలు జరిగాయన్నారు. సీజనల్ రకం కాయలు టన్ను గరిష్ఠంగా 20వేలు, కనిష్ఠం రూ.3వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 966 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు తెలిపారు.



# సార్.. అన్యాయం చేయొద్దు..!

(5వ పేజీ తరువాయి)

నిలదీశారు. ముగ్గురు వ్యక్తులతో లావాదేవీలు నిర్వహిస్తూ, వారు చెప్పిన వారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తున్నారని బయట ప్రచారం జరుగుతోందన్నారు. క్రమబద్ధీకరణలో స్థానాలు కోల్పోయిన సిబ్బందికి సమీపంలోనే పోస్టింగ్ ఇవ్వాలన్నారు. ఐదేళ్లు పూర్తయిన వారి జాబితాతోపాటు ఖాళీల వివరాలు ప్రదర్శించి, సిబ్బందికి ఆప్షన్లు ఇచ్చుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. రిక్వెస్ట్ బదిలీలు పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. సంఘం నాయకుల వాదనలకు జేడీ స్పందిస్తూ.. తనపై ఆరోపణలు చేయడం సరికాదని, అవసరమైతే ఏసీబీకి ఫిర్యాదు చేస్తానన్నారు. దీంతో తాము తప్పు చేసి ఉంటే ఎలాంటి శిక్షకైనా సిద్ధమేనని సంఘం నాయకులు స్పష్టం చేశారు. దాదాపు గంటకుపైగా జేడీ, సంఘం నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఎట్టకేలకు ఐదేళ్లు పూర్తయిన పోస్టులతోపాటు ఖాళీ పోస్టుల వివరాలను ప్రదర్శించి, పారదర్శకంగా బదిలీలు చేపడతామని జేడీ హామీ ఇవ్వడంతో సంఘం నాయకులు శాంతించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షు డు శివ, ప్రధాన కార్యదర్శి నరేష్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ రజాక్, ఉపాధ్యక్షులు చైతన్య, జగదీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### జేడీ ఆధ్వర్యంలో బదిలీలు చేస్తే అన్యాయమే

ఈనెలాఖరులో ఉద్యోగ విరమణ పొందనున్న పశుసంవర్థక శాఖ జేడీ వెంకటస్వామి ఆధ్వర్యంలో బదిలీలు జరిగితే తమకు అన్యాయం జరుగుతుందని పశుసంవర్థక సహాయకుల సంఘం నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శివ, ప్రధాన కార్యదర్శి నరేష్‌కుమార్ ఇతర సంఘం నాయకులు కలెక్టర్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. బదిలీల సమస్యలపై జేడీ వెంకటస్వామికి వినతి పత్రం అందజేయగా 'ఖాళీ పోస్టులు చూపించను. నాకు నచ్చిన వ్యక్తిని, నచ్చిన చోటుకు బదిలి చేస్తా. కౌన్సెలింగ్ కూడా పెట్టను' అంటూ తమను కార్యాలయం నుంచి బయటకు పంపించారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. నిబంధనల మేరకు పారదర్శకంగా బదిలీలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

# బదిలీల్లో గందరగోళం..!

తొలుత సీనియార్టీ జాబితా మేరకు...

మధ్యాహ్నం నుంచి ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్

గ్రామ వ్యవసాయ సహాయకుల బదిలీల్లో సిఫార్సులు

లేఖలు జతచేయని వారికి అన్యాయం



గ్రామ వ్యవసాయ సహాయకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

అనంతపురం అర్బన్, జూన్28(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ గందరగోళ ంగా మారింది. అనంతపురం వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అగ్రికల్చర్ అసిస్టెంట్‌ల బదిలీల కౌన్సెలింగ్ శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. తొలుత స్పౌజ్, వికలాంగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ తర్వాత మిగతా సిబ్బందికి కౌన్సెలింగ్ ప్రక్రియలో సీనియార్టీ జాబితా మేరకు చాంబర్‌లోకి పిలిచారు. సీనియార్టీ మేరకు కౌన్సెలింగ్ నిర్వహించడంపై సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో గంటపాటు కౌన్సెలింగ్ నిలిచిపోయింది. తిరిగి మధ్యా హ్నం నుంచి ర్యాంకుల వారిగా కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంత జిల్లాలో 126 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 124 మంది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. వీరిలో అనంత జిల్లాలో 101 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 102 మంది సిబ్బందికి ఐదేళ్ల కాలం పూర్తయింది. మిగిలిన సిబ్బంది రిక్వెస్ట్ కింద బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో జేడీ కార్యాలయం సిబ్బందితో కిక్కిరిసింది. రాత్రి 9.40 దాకా బదిలీల కౌన్సెలింగ్ కొనసాగింది.

### సిఫార్సులకు పెద్దపీట

విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల బదిలీల్లో ప్రజాప్రతినిధుల సిఫార్సులకే పెద్ద పీట వేశారు. సిఫార్సు లేఖలు జత చేయని సిబ్బందికి అన్యాయం జరిగింది. మండల, డివిజన్ స్థాయి అధికారులు తమకు అనుకూలమైన స్థానం కోసం ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు పెట్టడం సాధారణం. అందుకు విరుద్ధంగా రైతు సేవా కేంద్రంలో పనిచేసే సిబ్బంది బదిలీల కోసం ప్రజాప్రతినిధుల సిఫార్సులేఖలు ఇవ్వడం గమనార్హం.

### నేడు కౌన్సెలింగ్‌కు రండి

- ఉద్యాన శాఖ డీడీ ఉమాదేవి

అనంతపురం అర్బన్(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా ఉద్యాన సహాయకులకు ఆదివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఉద్యాన శాఖ డీడీ ఉమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అనంతపురం ఉద్యాన డీడీ కార్యాల యంలో ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రారంభిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఐదేళ్లు పూర్తయిన 280 మందితోపాటు రిక్వెస్ట్ బదిలీ కోసం 43 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే సిబ్బంది ఆప్షన్ ఫాంతోపాటు తగిన పత్రాలు తీసుకురావాలన్నారు. మెరిట్ సీనియార్టీ మేరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఆవె వెల్లడించారు.

### వార్డు సెక్రటరీల బదిలీలు పూర్తి



సచివాలయ సంక్షేమ కార్యదర్శుల బదిలీల్లో గందరగోళం తలెత్తడంతో సర్దిచెబుతున్న కదిరి మున్సిపల్ కమిషనర్

అనంతపురం క్లాక్‌టవర్(ఆంధ్రజ్యోతి): స్వల్ప ఉద్రిక్తతల నడుమ మున్సిపాలిటీల పరిధిలోని వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలు పూర్తి చేశారు. మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్ జోక్యంతో ఉమ్మడి జిల్లా పరిధిలోని 12మున్సిపాలిటీల సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ సజావుగా నిర్వహించినట్లు కన్వీనర్, అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు. జీసెస్‌నగర్‌లోని జయమణెమ్మ కల్యాణమండపంలో ఉదయం వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలకు కౌన్సెలింగ్ నిర్వహించి, 262మందిని బదిలీ చేశారు. మధ్యాహ్నం వార్డు వెల్ఫేర్ సెక్రటరీలకు జరిగిన కౌన్సెలింగ్‌లో 235మందికి స్థానచలనం కలిగించారు. తపోవనం సర్కిల్‌లో ఉన్న పుష్ప ఫంక్షన్‌హాల్‌లో ఉదయం వార్డు శానిటేషన్ సెక్రటరీలకు కౌన్సెలింగ్ చేపట్టగా 227మందిని, మధ్యాహ్నం వార్డు అమెనిటీస్ సెక్రటరీలకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించగా 121మందిని బదిలీ చేశారు. అనంత నగరపాలక సంస్థ నూతన కాన్ఫరెన్స్‌హాల్‌లో ఉదయం వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు బదిలీ కౌన్సెలింగ్‌ను ఏర్పాటు చేయగా 120మందిని బదిలీ చేశారు. అయితే శుక్రవారం అడ్మిన్ సెక్రటరీలకు జరిగిన బదిలీ కౌన్సెలింగ్‌లో అవకతవకలు జరిగినట్లు గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు మున్సిపల్ ఆర్డీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో చర్చించి ఆ బదిలీ ప్రక్రియను రద్దు చేయించారు. తిరిగి శనివారం సాయంత్రం నిర్వహించారు. దీంతో అడ్మిన్ సెక్రటరీలు 156మందిని బదిలీ చేశారు. జయమణెమ్మ కళ్యాణమండపంలో జరిగిన ఎడ్యుకేషన్ సెక్రటరీల స్పౌజ్ బదిలీ విషయంలో కొంత గందరగోళం ఏర్పడింది. ఎట్టకేలకు 12 మున్సిపాలిటీలలోని వార్డు సచివాలయాల ఉద్యోగులు మొత్తం 1121మందిని బదిలీ చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు.

## అధికారుల అనాలోచిత నిర్ణయం

బదిలీల కౌన్సెలింగ్‌కు ఇద్దరికి ఆహ్వానం

ఒకరికే పూర్తి.. మరొకరికి వాయిదా..



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీఓలు నాగరాజ నాయుడు, సమత

అనంతపురం న్యూటౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారుల అనాలోచిత నిర్ణయంతో బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన గ్రేడ్-5 కార్యదర్శులు, గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 9 గంటలకే కౌన్సెలింగ్‌కు తరలి వచ్చారు. దీంతో జిల్లా పరిషత్ ఆవరణం నిండిపోయింది. అధికారులు తీరిగ్గా 11 గంటలకు గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభించారు. అనంత, శ్రీసత్యసాయి డీపీఓలు నాగరాజనాయుడు, సమత, డీఎల్‌పీఓలు విజయ్‌కుమార్, శివకుమారి, ఏఓ నాగరాజు కౌన్సెలింగ్ చేపట్టారు. స్పౌస్ కేటగిరీ వారితో మొదలు పెట్టారు. మధ్యాహ్నం వరకు వారిదే సాగింది. ఒకేరోజు పూర్తికావడం కష్టమని భావించిన అధికారులు.. ఆప్షన్లు ఇచ్చేసి వెళ్లిపోవాలని సూచించారు. కౌన్సెలింగ్ నిర్వహించి వెంటనే బదిలీ ఉత్తర్వులు జారీ చేయాలని కొందరు నిరసనకు దిగారు. దీంతో గ్రేడ్-5 కార్యదర్శుల కౌన్సెలింగ్ ఆదివారానికి వాయిదా వేశారు. గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్లకు ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ చేపట్టారు. రాత్రి పొద్దుపోయేదాకా ప్రక్రియ సాగింది. బదిలీ ఉత్తర్వులు వెలువడితేగానీ, పారదర్శకంగా చేశారా అన్నది తెలియని పరిస్థితి.

## జాతీయ జట్టుకు ఆడాలి

ఏసీఏ కామెంటేటరీల సంఘం చైర్మన్ కళ్యాణకృష్ణ

మల్టీ డే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అనంతలో ఉండే వసతులు, సదుపాయాలను సద్వినియోగం చేసుకుని జాతీయ జట్టుకు ఆడే స్థాయికి చేరాలని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ)కామెంటేటరీల సంఘం చైర్మన్ కళ్యాణకృష్ణ ఆకాంక్షించారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ మల్టీడే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను శనివారం అనంతపురంలోని అనంత క్రికెట్ మైదానంలో ప్రారంభించారు. కార్యక్రమానికి కళ్యాణకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలిపోటీ అనంతపురం, కడప జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన కడప తొలి ఇన్నింగ్స్‌లో 76.5ఓవర్లలో 273పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్ వంశీకృష్ణ 86పరుగులు, జహీర్ అబ్బాస్ 85, జయవర్ధన్ 40 పరుగులు చేశారు. అనంత బౌలరు కమిల్ 3వికెట్లు పటగొట్టాడు. అనంతరం బరిలోకి దిగిన అనంత మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆరు ఓవర్లలో వికెట్ నష్టానికి 47పరుగులు చేసింది. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో కర్నూలు, చిత్తూరు జట్లు తలపడ్డాయి. కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 71.5ఓవర్లలో 250పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్లు సంజయ్‌నాయుడు 84పరుగులు, అశోక్‌కుమార్ 76 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్ మాధవ్‌నాయుడు 3వికెట్లు, మల్లేషన్, ధరణికుమార్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు 12ఓవర్లలో 49 పరుగులకే 3వికెట్లు కోల్పోయింది. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, సహాయ కార్యదర్శి మురళీ కృష్ణ, కోశాధికారి షబ్బీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# పారా క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పారా క్రీడలు ఆడే దివ్యాంగులను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. పారా స్పోర్ట్స్ చైతన్యయాత్ర శనివారం జిల్లాకు చేరింది. స్థానిక అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో డీఎస్‌డీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన క్రీడాపాలసీతో పారా క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా 3శాతానికి పెంచిన సీఎం చంద్రబాబుకు క్రీడాకారులు రుణపడి ఉంటారన్నారు. పారా ఒలింపిక్స్, పారా ఆసియన్ గేమ్స్, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన పారా క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల నగదు ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర బృందాన్ని సన్మానించారు. కార్యక్రమంలో మీనాక్షమ్మ ఫౌండేషన్ చైర్మన్ రవికాంత్ రమణ, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, నెల్లూరు మాల్యాద్రి నాయుడు, గుంటూరు శ్రీనివాసగౌడ్, అథ్లెటిక్ కోచ్ మంజుల, వెంకట్, సుభాషిణి, వేణుగోపాల్, మల్లికార్జున, పారా క్రీడాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్

## రిక్వెస్టులలో వాస్తవమెంత?

(5వ పేజీ తరువాయి)

తన్నుకుపోయారు. దీంతో అధికారులతో యూనియన్ నాయకులు వాగ్వాదానికి దిగారు. ఒకరోజు గడువిస్తే.. రిక్వెస్టులలో వాస్తవాలు తేలుస్తామంటూ వాదనకు దిగారు. దీంతో అధికారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అంతలోనే ఎస్ఈ జహీర్ అస్లాంకి కలెక్టర్ నుంచి ఫోన్ వచ్చిందంటూ వెళ్లిపోయారు. దీంతో శ్రీసత్యసాయి జిల్లా వారి కౌన్సెలింగ్ చేపట్టారు. తొలుత అనంతపురం జిల్లా పూర్తి చేయాలని వాదనకు దిగడంతో బదిలీల ప్రక్రియను వాయిదా వేశారు. దీనిపై చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు.

### యూనియన్ నాయకుల ఓవరాక్షన్

శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేసే కొందరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు యూనియన్ నాయకుల పేరుతో హల్‌చల్ చేశారు. అధికారులను సైతం కౌన్సెలింగ్ నిర్వహించే ప్రాంతానికి వెళ్లనీయకుండా వాదనలకు దిగారు. వారి తీరు విమర్శలకు తావిస్తోంది.

## వక్ఫ్ భూముల వేలం

దర్గాహొన్నూరు భూములకు రూ.4.2 లక్షల ఆదాయం



వక్ఫ్‌బోర్డు భూములకు వేలం నిర్వహిస్తున్న రామసుబ్బారెడ్డి

అనంతపురం విద్య, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు భూముల ను కౌలుకు చేయడానికి రైతులు పోటీ పడ్డారు. వక్ఫ్ భూములకు కౌలు వేలం జిల్లా మైనార్టీ కార్యాలయంలో మైనార్టీశాఖ జిల్లా అధికారి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూర్ దర్గాకు చెందిన 25.50ఎకరాల భూముల సాగుకు ఆప్రాంత రైతులు పోటీగా తరలివచ్చారు. అంతకుముందు రామసుబ్బారెడ్డి, రెవెన్యూశాఖ తరఫున గోవిందవాడ వీఆర్ఓ సుజాతారామ్ నిబంధనలను వివరించారు. వేలంలో దక్కించుకున్న వారు మూడేళ్ల పాటు భూములు సాగుచేసుకోవచ్చని, ప్రతి ఏటా పాడిన పాటకు అదనంగా 6శాతం డబ్బు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆతర్వాత వేలం మొదలు పెట్టగా, తలారి పోతులింత అనే రైతు రూ.4.20 లక్షలకు గోవిందవాడ దర్గా భూములను దక్కించుకున్నాడు. గుంతకల్లు హాజీదర్గాకు చెందిన 38ఎకరాల భూములను వేలం పాడటానికి రైతులు నిరాసక్తి చూపారు. ఆభూములలో చెట్లు ఎక్కువగా ఉన్నాయని, పంటపెట్టినా దిగుబడి రాదని ఎకరా రూ.30వేలకు ఇవ్వాలని కోరారు. జిల్లా మైనార్టీ అధికారి మాత్రం ఎకరా రూ.50వేలు చెప్పగా పాట పాడటానికి రైతులు ముందుకు రాలేదు. దీంతో గుంతకల్లు దర్గాభూముల వేలం వాయిదా వేశారు. గతంలో గోవిందవాడ దర్గా భూములకు రూ.2లక్షలు ఆదాయం వచ్చింది. ఈసారి రూ.4.20లక్షలకు పెరిగినట్లు రామసుబ్బారెడ్డి తెలిపారు.

## ప్రధాన నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ధర్మవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలంలో దళిత బాలికపై అత్యాచారం కేసులో ప్రధా న నిందితుడు ప్రతీష్‌ను అరెస్టు చేసినట్లు డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. శనివారం సా యంత్రం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడించారు. ఇటీవల వెలుగుచూసిన బాలికపై అత్యాచారం కేసులో 14 మందితోపాటు ఇద్దరు పెద్ద మనుషులపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే 15 మందిని రిమాండ్‌కు పంపారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు తూమప్పగారి ప్రతీష్‌ను రామగిరి మండలం చెన్నంపల్లి క్రాస్ వద్ద శనివారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని పుట్టపర్తి కోర్టులో హాజరుపరచగా.. న్యాయాధికారి జూలై 7వ తేదీ వరకు రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

## బావిలో పడి వ్యక్తి మృతి

నార్పల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూగూడు గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు బావిలో పడి రాజశేఖర్(53) మృతిచెందాడు. గ్రామానికి చెందిన రాజశేఖర్ ఆలయ సమీపంలో ఉన్న బావి దగ్గరకు నీళ్ల తాగడానికి వెళ్లాడు. బావిలో దిగగా ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడ్డాడు. అతడికి ఈత రాకపోవడంతో బావిలో మునిగి మృతిచెందాడు. మృతుడికి భార్య రమాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

## ఖాశీం స్వామి ఉత్సవాలు ప్రారంభం

బత్తలపల్లి, జూన్28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శనివారం ఖాశీం స్వామి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లా అనంతలో గూగూడు కుళ్లాయిస్వామి తరువాత అంతటి స్థాయిలో బత్తలపల్లి ఖాశీం స్వామి ఉత్సవాలు జరుగుతాయి. మొదటి రోజు శనివారం పీర్ల మకాన్‌లో ఖాశీం స్వామి ఆశీనులయ్యారు. జూలై 4న చిన్న సరిగెత్తు, 5న కాసీంస్వామి గ్రామాల పర్యటన, 6న పెద్ద సరిగెత్తు, 7న వివిధ గ్రామాల పీర్లతో ఖాశీం స్వామి భేటీ, అదేరోజు సాయంత్రం జలధి, 9న సామివారి చివరి దర్శనంతో ఉత్సవాలు ముగియనున్నాయి.



న్యూస్ బాక్స్

## ఆస్పత్రిలో రికార్డుల తనిఖీ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

నల్లచెరువు, జూన్28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం శనివారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిం చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... 2024-25 సంవత్సరానికి సంబంధించిన రికార్డులను, ఆసుపత్రిలో నిర్వహించిన 14 రకాల బిల్లులను పరిశీలించినట్లు చెప్పారు. బిల్లులకు సంబం ధించి ఎలాంటి అవకతవకలు లేవని ఎన్హెచ్ఎం మధు తెలిపారు. ఆసుపత్రి నిర్వహణలో చిన్నపాటి లోపాలున్నాయని, సరిచూసుకోవాలని వైద్యాధికారులకు సూచించామని డీఎంహెచ్ ఓ తెలిపారు. ఆమెతో పాటు వైద్యాధికారులు కల్పనారెడ్డి, అలేఖ్య, సీహెచ్సీఓ రామచంద్రారెడ్డి, సూపర్వైజర్ సుధాకర్ పాల్గొన్నారు.

## ఇన్చార్జి తహసీల్దార్గా నరసింహులు

బుక్కపట్నం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండల ఇన్చార్జ్ తహసీల్దార్గా నరసింహులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్గా విధులు నిర్వహిస్తున్న షాబుద్దీన్ బదిలీపై తనకల్లు మండలానికి వెళ్లారు. దీంతో బుక్కపట్నంలో డిప్యూటీ తహసీల్దార్గా విధులు నిర్వహిస్తున్న నరసింహులుకు ఇన్చార్జ్ తహసీల్దార్గా బాధ్యతలు అప్పగించారు. ఆయనను టీడీపీ మండల కన్వీనర్ చింతామల్లిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగాధర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, డీలర్లు సన్మానించారు.

## 6న ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పేదల కోసం ప్రతినెల ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలానాగేంద్ర, కార్యదర్శి జయరాం తెలిపారు. ఈ మేరకు జూలై 6వ తేదీన యువర్స్ ఫౌండేషన్, బెంగళూరుకు చెందిన నేత్రజ్యోతి కంటి ఆస్పత్రి సంయుక్తంగా స్థానిక బాలుర ఉన్నతపాఠశాల ఆవరణలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని స్వాతిక్లినిక్లో శనివారం సంబంధి త కరపత్రాలను విడుదల చేశారు. యువర్స్ ఫౌండేషన్ కోశాధి కారి వంకదారి మోహన్, పీఆర్ఓ రాధాకృష్ణ, జాయింట్ సెక్రటరీ గరే రమేశ్బాబు, స్టార్ ఖలీల్, కేతా లోకేశ్ తదతరులు పాల్గొన్నారు.

## ఆశా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

నంబులపూలకుంట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలో ఖాళీ పడిన రెండు ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వైద్యాధికారి ఆనంద్వర్ధన్ శని వారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వైద్యాధికారులు విడుదల చేసిన నోటిఫికేషన్లో భాగంగా మండలంలోని మేకలచెరువు సచివాలయంలోని అరవవాండ్లపల్లి, వెలిచెలమల ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయిందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 30లోగా దరఖాస్తులను స్థానిక వైద్యాధికారికిగానీ, గ్రామ సచివాలయంలో ఏఎన్ఎంకుగానీ అందించాలని తెలిపారు.

## రామాలయ నిర్మాణానికి విరాళం

నల్లచెరువు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బసవన్న కట్ట సమీపంలో నిర్మిస్తున్న సీతారాముల ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు శనివారం విరాళాలు అం దించారు. నల్లచెరువులో నివాసముంటున్న మరాఠీ కండెక్టర్ ఆదినారాయణ కుమారుడు శ్రీనివసరావు రూ.25వేలు, శంకరపు సూర్యనారాయణ సతీమణి రూ.10,016 వివరాళం ఇచ్చి నట్లు తెలిపారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు శనివారం దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నగేష్, నరసింహారెడ్డి, రెడ్డెప్ప, శివన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం

తనకల్లు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళం తండాకు చెందిన కొర్రా వెంకటరమణనాయక్ కుమారుడు నవీన్ నాయక్ గత నెలలో విద్యుత్ ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో చిన్నారి ఎడమచేతిని తొలగించారు. విషయం తెలుసుకున్న వందేమాతరం టీమ్ సభ్యులు అతడి వైద్య ఖర్చుల కోసం రూ. 20వేల ఆర్థిక సాయాన్ని శనివారం ఆ కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో వందేమాతరం టీమ్ సభ్యులు తమ్మిశెట్టి రవీంద్ర, కొండ్ల రమేష్, భాస్కర్, సంకు వెంకటరమణ, బాగేపల్లి అశోక్, నవీన్, బాలు, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## కారు, బైకు ఢీ - ఇద్దరికి గాయాలు

బత్తలపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం సమీపంలో బైపాస్ రోడ్డుపై శనివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మండలపరిధిలోని తబ్బల్లపల్లికి చెందిన రమేష్రెడ్డి తన అత్తగారి ఊరైన రాయదుర్గానికి కారులో వెళ్లి తిరిగి వస్తున్నాడు. అలాగే మర్రిమాకులపల్లికి చెందిన మల్లేసు, వెంకటగారిపల్లికి చెందిన వెంగముని ద్విచక్రవాహనంలో వేల్పుమడుగు గ్రామం నుంచి బత్తలపల్లికి వెళ్తున్నారు. బత్తలపల్లి సమీపంలో వేల్పుమడుగు క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని రమేష్ రెడ్డి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లేసు, వెంగముని తీవ్రంగా గాయపడ్డరు. వారిని స్థానికులు అదే కారులో స్థానిక ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఏఎస్ఐ సోమశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు వీరనారప్ప ఆర్డీటీ ఆసుపత్రికి వెళ్లి గాయపడిన వారిని పరామర్శించారు.

## దగ్ధమైన దుకాణాన్ని పరిశీలించిన చిలకం

బత్తలపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన బత్తలపల్లిలో విద్యుత్ షాక్ సర్క్యూట్తో దగ్ధమైన ఎరువుల దుకాణాన్ని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన రెడ్డి శనివారం పరిశీలించారు. బత్తలపల్లికి చెందిన మోహన్రెడ్డి ఎరువుల దుకాణం గురువారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న చిలకం మధూసూదనరెడ్డి ఆ దుకాణాన్ని పరిశీలించారు. నిర్వహకుడు మోహన్ రెడ్డిని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుకున్నారు. అధైర్యపడకండి... అండగా ఉంటామని తెలిపారు. అయన వెంట జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న చిలకం మధుసూదన్రెడ్డి

# చేనుకు సారోళ్లు..

● 'పొలం పిలుస్తోంది రా..'తో అన్నదాతకు అండ
● వారంలో రెండు రోజులు శిక్షణ
● రైతుల వద్దకే శాస్త్రవేత్తలు, అధికారులు



కుమ్మరవాండ్లపల్లి పరిధిలో రైతులతో సమావేశమైన అధికారులు (ఫైల్)

కదిరి అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రైతులు వేలు, లక్షలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలు తెగుళ్ల బారిన పడితే వాటిని ఎలా అరికట్టాలో? పంటను ఎలా కాపాడుకోవాలో? తెలియక దిక్కులు చూసేవారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు ఉన్నా.. కార్యాలయాలకే పరిమితమయ్యేవారు. దీంతో కళ్లెదుటే పంట దెబ్బతింటున్నా.. కన్నీరు పెట్టుకోవడం తప్ప.. కాపాడుకునే అవకాశం ఉండేది కాదు. అన్నదాతకు అండగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. పంటలను కాపాడే చర్యలు చేపట్టింది. 'పొలం పిలుస్తోంది.. రా..' కార్యక్రమాన్ని చేపట్టి వ్యవసాయ శాఖాధికారులు, శాస్త్రవేత్తలను చేలలోకే పంపుతోంది. అక్కడే రైతులకు వ్యవసాయంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపుతూ, సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. ఈనెల 17వ తేదీన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రకృతి సేద్యం, రసాయన ఎరువుల వాడకంలో జాగ్రత్తలు, విత్తన ఎంపిక, బయో ఎరువులు, యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరిస్తున్నారు.

### ప్రతి మంగళ, బుధవారాల్లో...

ప్రభుత్వ ఆదేశాలతో వారంలో రెండురోజుల పాటు మంగళ, బధవారాలు శాస్త్రవేత్తలు, అధికారులు, సిబ్బంది పొలంబాట పట్టాలి. వ్యవసాయ, పశుసంవర్ధక, పట్టు పరిశ్రమ, ప్రకృతి సేద్యం, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పంటలను సందర్శించి, తెగుళ్ల, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వ పథకాలు, సాంకేతిక సలహాలు అక్కడికక్కడే అందిస్తారు. అందుబాటులోకి వచ్చిన యాంత్రీకరణ, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రకృతి సాగును ప్రోత్సహించే విధంగా రైతుల్లో అవగాహన కల్పిస్తారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు ఎక్కువగా వినియోగించడం ద్వారా తలెత్తే దుష్పరిణామాలు వివరిస్తున్నారు.

### కార్యాచరణ ఇలా..

ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు క్షేత్రస్థాయిలో అధికారులు పంటలను పరిశీలిస్తారు. 10 నుంచి 12 గంటలదాకా నిపుణులు, శాస్త్రవేత్తలను పిలిపించి రైతులతో ముఖాముఖి మాట్లాడిస్తారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎంపిక చేసిన గ్రామంలో రైతులు సాగుచేసిన పంటలను పరిశీలిస్తారు. 4 నుంచి 5.30 గంటల వరకు సమావేశం ఏర్పాటు చేసి, రైతుల సందేహాలు నివృత్తి చేస్తారు.

### రైతులు సద్వినియోగం చేసుకోవాలి

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ల క్ష్యంగా ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది రా..' కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ శిక్షణను రైతులు సద్వినియోగం చేసుకుని, అధిక దిగుబడులు సాధించాలి. సాగులో పెట్టుబడులు తగ్గిస్తూ అధిక ప్రయోజనాలు కలిగేలా అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలను రైతులు పాటించాలి. పంట లోపాలను గుర్తించి, ఆధునిక సేద్యంపై అవగాహన పెంచుకోవాలి. - శ్రీహరినాయక్, మండల వ్యవసాయాధికారి, కదిరి



## వేదవిద్య మహాసభలో పాల్గొన్న ఎమ్మెల్యే



మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దత్త ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్న సరస్వతి వేద విద్య మహాసభల్లో రెండో రోజు శనివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదవిద్యా మహాసభలను పట్టణంలో నిర్వహించడం గర్వకారణమన్నారు. వేద పండితుల వల్ల ఈ రాష్ట్రానికి, దేశానికి మేలు కలగాలన్నారు. తాను తిరుపతిలోని వేద పాఠశాలలో గడిపానన్నారు. ఎన్నో మార్లు ఆశీర్వచనాలు తీసుకున్నట్లు తెలిపారు. ఇలాంటి మహాసభలు కదిరిలో నిర్వహించడంతో కదిరికి ఎంతో ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు అర్చకులు, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

● ఎమ్మెల్యేకి సీపీఎం నాయకుల వినతి

కదిరి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరవాండ్లపల్లిలో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు వ్వాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు శనివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ను పట్టణంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇళ్ల పట్టాలు ఇవ్వాలని నాలుగు నెలల క్రితం పలువురు పేదలు గ్రామ సచివాలయం, తహసీల్దార్, ఆర్డీఓకు దరఖాస్తు చేసుకున్నా రని తెలిపారు. కుమ్మరవాండ్లపల్లి పంచాయతీలోని సర్వే నంబర్ 720లోని ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం మంజూరు చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు జీఎల్ నరసింహులు, బాబ్జాన్, ముస్తాక్, సుధాకర్రెడ్డి, ఆంజనేయులు, ఉదయ్, నారాయణ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## కార్యాలయం వద్ద అపరిశుభ్రత



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న వ్యవసాయ కార్యాలయం

ధర్మవరం రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అధికారులు వారి కార్యాలయాల వద్ద కూడా నిర్వహించ లేకపోతున్నారు. ప్రభుత్వం చెప్పింది కదా... ఏదో ఒకరోజు ఒక గ్రామానికి వెళ్లి హడావుడి చేసి, ఫొటోలు తీయించుకుంటే సరిపోతుంది అనుకున్నారేమో మరి. కనీసం వారి కార్యాలయాల వద్ద పరిశుభ్రత పట్టించుకోకపోవడం ఇందుకు నిదర్శనం ధర్మవరం పట్టణంలోని మండల వ్యవ సాయ కార్యాలయం. నిత్యం రైతులు వచ్చే ఆ కార్యాలయం వద్ద చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. పిచ్చిమొక్కలను దాటుకుని ఆ కార్యాలయంలోకి వెళ్లాల్సి ఉంది. పిచ్చిమొక్కలతో పాటు గడ్డిఏపుగా పెరగడంతో విషపురుగులు సంచరిస్తున్నాయని ప్రజలు వాపోతు న్నారు. ఆ కార్యాలయం వద్దకు వెళ్లాలంటే రైతులు హడలెత్తిపోతున్నారు. కార్యాల య పరిసరాలను శుభ్రం చేయించేందుకు అక్కడి అధికారులు ఆసక్తి చూపలేదు. కార్యాలయం చుట్టూ ఇంత అపరిశుభ్రంగా ఉందంటే అధికారులు నిత్యం కార్యాలయానికి వస్తున్నారా... లేదా.. అనే సందేహాన్ని ప్రజలు వెలిబుచ్చుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిత్యం రైతులు వచ్చే కార్యాలయం పరిసరప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకో వాలని పలువురు కోరుతున్నారు.

## 'ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు'




హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

తనకల్లు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఆర్ఐ అశోక్ చక్రవర్తి హెచ్చరించారు. మండలంలోని బొంతపల్లికి చెందిన ప్రభుత్వ భూము లు అన్నమయ్య జిల్లా మొలకలచెరువు సమీపంలో ఉన్నాయి. అందులోని సర్వే నంబర్ 183లో ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురవుతున్న విషయం తెలుసుకున్న ఆర్ఐ రెవెన్యూ సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించారు. 183 సర్వే నంబర్లో నాలుగు ఎకరాల 50 సెంట్లు ప్రభుత్వ భూమే అని తేల్చారు. ఎలాంటి అనుమతులు పొందకుండా ఈ భూముల్లో నిర్మాణాలు చేపట్టినా, ఆక్రమించినా, చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇది ప్రభుత్వ భూమేనని బోర్డును ఏర్పాటుచేశారు. ఆయనతోపాటు వీఆర్ఓ ఆంజనేయులు, రెవెన్యూ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ పాలనపై సమావేశం

ఓబుళదేవరచెరువు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టి 11 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఆ పార్టీ నాయకులు స్ట్రీట్కార్నర్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండలకేంద్రంలో శనివారం ఆ పార్టీ మండలాధ్యక్షుడు వీరాంజి ఆధ్వర్యం లో జరిగింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి మరింత కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన క్యాదర్శి బూదిలి సుదర్శన్, అమడగూరు మండలాధ్యక్షుడు వేమనారాయణ, నాయకులు జయచంద్రారెడ్డి, ఆకుతోటపల్లి క్రిష్టప్ప, సున్నంపల్లి రంగారెడ్డి, మేకల వెంకటరమణ, ఆంజినప్ప, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## కొక్కంటిలో పౌరహక్కులపై అవగాహన

తనకల్లు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటి గ్రామంలో శనివారం తహసీల్దార్ షాబుద్దీన్ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరుల హక్కుల గురించి వివరించారు. వాటిని ఎవరూ ఉల్లంఘంచకూడదని తెలిపారు. అలాగే మహిళలు, బాలలు హక్కుల గురించి తెలయజేశారు. అనివర్గాల వారు వారికి రాజ్యాంగా కేటాయించిన హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రీన్ డే




గ్రీన్ డేలో పాల్గొన్న విద్యార్థులు

ధర్మవరం, జూన్28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాకతీయ పాఠశాలలో శనివారం గ్రీన్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆకుపచ్చ రంగు దుస్తులు ధరించి ఆకుపచ్చ రంగు వస్తువులతో పాఠశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శెట్టిపి జయచంద్రారెడ్డి ఆకుపచ్చ ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. అలాగే విద్యార్థులు కూరగాయలు, పండ్లు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శెట్టిపి సూర్యప్రకాశ్రెడ్డి, శెట్టిపి పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

● ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

కదిరి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ విభాగం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజనేయులు డిమాండ్ చేశారు. ఈ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో ఇంజనీరింగ్ విభాగం కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం వారం రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, సంక్షేమ పథకాలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో చనిపోయిన కార్మికుల కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ వయస్సు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. వారికి మద్దతుగా ఏఐటీయూసీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు నాగరాజు, సూరి, రంగనాథ్, గంగిరెడ్డి, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు జగన్నాథ రథయాత్ర



ధర్మవరం రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథుడి రథయాత్రను నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ ధర్మవరం ఇన్చార్జ్ శ్రీకృష్ణమాధవ దాస్ శనివారం తెలిపారు. జగన్నాథ, బలరామ, సుభద్రదేవి ప్రతిమలను పురవీధుల గుండా ఊరేగించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద రథయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. అక్కడి నుంచి పొట్టి శ్రీరాములు సర్కిల్, కళాజ్యోతి సర్కిల్, అంజుమన్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, పాండురంగస్వామిగుడి సర్కిల్, గాంధీ నగర్ శివాలయం మీదుగా బలిజ కల్యాణమండపం వరకు రథయాత్ర సాగుతుందన్నారు. రథయాత్ర అనంతరం జగన్నాథ లీలల ప్రవచనం, ప్రసాద వితరణ ఉంటుందన్నారు. రథయాత్రలో అనంతపురంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ఇస్కాన్ ప్రభుపాదుల వారు వస్తారని తెలిపారు. కావున ప్రజలందరూ ఈ మహారథయాత్రలో పాల్గొని, రథాన్ని లాగడం ద్వారా వారిపై స్వామివారి కృప కలుగుతుందని ఆయన తెలిపారు.

## నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

పుట్టపర్తి రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో ఆది పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ ఖాదర్వలి శనివారం పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు బెంగళూరుకు చెందిన ప్రియపెట్టేం అవిఘ్న అభ్యాస ఇనిస్టిట్యూట్, డ్యాన్స్ ఫైన్ ఆర్ట్ అకాడమీ వారిచే భరతనాట్య నృత్యప్రదర్శన ఉంటుందన్నారు. పట్టణవాసులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

## పార్టీ పటిష్టతకే వార్డు కమిటీలు

● టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్

ధర్మవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టత కోసం వార్డు కమిటీలను ఎంపిక చేస్తున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు పట్టణంలోని పలు వార్డుల కమిటీలను ఎంపికచేశారు. అదేవిధంగా శనివారం 25వ వార్డులో పరిశే సుధాకర్తో పాటు నాయకులు చింతపులుసు పెద్దన్న, అత్తర్ రహీంబాషా, అస్లాం సమక్షంలో వార్డు కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా భీమనేని ప్రసాద్నాయుడు, ఉపాధ్యక్షుడిగా చీమల రామాంజి, కోశాధికారిగా గడ్డం సూరిని ఎంపిక చేశారు. అలాగే జనరల్ సెక్రటరీగా అల్లా బకాష్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కేఎం అమర్నాథ్ చౌదరి, రవి, కార్యదర్శులుగా రాజు, శిండే శ్రీనివాసులు, సురేశ్చౌదరితోపాటు 11మంది సభ్యులను ఎన్నుకున్నారు. తన ఎంపికకు సహకరించిన ప్రతి ఒక్కరికి భీమినేని ప్రసాద్ నాయుడు కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా 11,12 వార్డులలోనూ టీడీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగూర్హుస్సేన్, నాయకులు సంధా రాఘవ, కొత్తపేట ఆది, జింకా పురుషోత్తం, అశోక్ ఆధ్వర్యంలో వార్డు కమిటీల ఎంపికపై చర్చించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ రామాంజి, 11, 12వ వార్డుల ఇన్చార్జ్లు షాహీర్, స్టార్ సమీర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్లో బీఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ



జిల్లా ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన చైతన్య ప్రసాద్, జశ్వంత్

ధర్మవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ల్లో పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం మేరీ వరకుమారి పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబరు 8న నిర్వహించిన పరీక్షలలో బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన చైతన్యప్రసాద్ 139 మార్కులు సాధించి జిల్లా ప్రథమ ర్యాంకు, జశ్వంత్ 131 మార్కులు సాధించి రెండో ర్యాంకు సాధించారని ఆమె తెలిపారు. మిగిలిన 11 మంది ఎన్ఎంఎంఎస్కు ఎంపికయ్యారని తెలిపారు. వీరికి నాలుగేళ్లపాటు రూ.12వేలు చొప్పున ప్రభుత్వం అందిస్తుందన్నారు. పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు ఆ విద్యార్థులను అభినందించారు.

## దాడికి పాల్పడిన వారిపై కేసు

ధర్మవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 23న రాత్రి ఎగ్జిబిషన్ నిర్వాహకులు, సిబ్బందిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్టు వన్టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణానికి చెందిన గంగయ్య, అతడి కుటుంబసభ్యులు పట్టణంలో ఎగ్జిబిషన్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 23న సోమవారం రాత్రి ఎగ్జిబిషన్ మూసివేసే సమయంలో అరిఫుల్లా, ఇంతియాజ్, బాబా చాంద్ మరి కొంత మంది ఎగ్జిబిషన్ నిర్వాహకులు, సిబ్బందిపై రాళ్లు, కట్టెలతో విచక్షణా రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయ పరిచారు. అదేవిధంగా ఎగ్జిబిషన్లోని వస్తువులన్నిటినీ ధ్వంసం చేశారు. దీంతో నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

## తాగునీటికి ఇబ్బందులు



చేతిపంపు వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

అమడగూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మహ్మదాబాద్ ఎస్సీ కాలనీ వాసులు దాదాపు మూడురోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వారికి చేతిపంపే ఆధారమైంది. కాలనీలోని వృద్ధులు, వికలాంగులు చేతిపంపు కొట్టలేక ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో దాదాపు మూడు వందల కుటుంబాలు ఉండగా, రెండు వేలకుపైగా జనాభా ఉన్నట్లు వారు తెలిపారు. కా లనీలో ఆ చేతిపంపు కూడా లేకపోతే నీటి కోసం తమ కష్టాలు అన్నీఇన్నీకావని అంటున్నారు. కాలనీలో తాగునీటి పంచాయతీ బోరు మోటారు. మూడు రోజుల క్రితం కాలిపోయింది. దానిని బయటకు తీసి మరమ్మతులు చేయించారు. అయితే తిరిగి దానిని లోపలికి దించాలంటే బోరు బావిలో రాళ్ల అడ్డంగా ఉన్నాయని గ్రా మస్థులు చెబుతున్నారు. వివిధరకాల యంత్రాలతో ప్రయత్నించినా ఫలితం లేదంటున్నారు. ఇంకో బోరు వేసేందుకు అధికారులు ప్ర యత్నిస్తున్నట్లు తెలిపారు. అప్పటి వరకు తమకు చేతిపంపు నీరే గతి అని అంటున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి జానకిని వివరణ కోరగా... బోరుబావిలో మోటారు దించాలంటే రాళ్లు అడ్డంగా ఉన్నాయని తెలిపారు. వాటిని తొలగించేందుకు యంత్రాలతో పగలకొట్టినా ఫలితం లేదన్నారు. తాత్కాలికంగా కాలనీవాసులకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని తెలిపారు. తరువాత పంచాయతీ బోరును మరొకటి వేయించి, కొళాయిల ద్వారా నీటిని అందిస్తామని తెలిపారు.

## పేట వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



హిందూపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆషాడమాసం మొదటి శనివారాన్ని పురస్కరించుకుని పేట వెంకటరమణస్వామి ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేశారు. అదేవిధంగా ఉత్సవ విగ్రహాలతో ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

## విద్యార్థులు బాగా చదవాలి: ఎంఈఓ-2



బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు

అగళి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదవాలని ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు సూచించారు. ప్రభుత్వం సౌకర్యాలను కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా పాఠశాలలకు విద్యాసామగ్రిని సిబ్బందితో తరలించి పంపిణీ చేసినట్లు తెలిపారు.

## వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించండి: ఎస్‌ఎఫ్‌ఐ



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గుడిబండ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రభుత్వం అన్నివసతులు కల్పించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణ్‌చక్రవర్తికి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినతిపత్రం అందించారు. హాస్టల్‌లో చదివే విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాళ్లపల్లి హాస్టల్ భవనం వర్షాకాలంలో కారుతోందని చర్యలు తీసుకోవాలన్నారు. వార్డన్లు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అంజి, వినోద్, తిప్పేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీచిగానిపల్లి రహదారికి మరమ్మతులు



ఎక్స్‌కవేటర్‌తో పనులు చేస్తున్న దృశ్యం

పరిగి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఊటకూరు గ్రామం నుంచి బీచిగానిపల్లికి వెళ్లే రహదారిని శనివారం ఓ ప్రైవేట్ బస్సు డ్రైవర్ హరి తన సొంత ఖర్చులతో ఎక్స్‌కావేటర్ సాయంతో మరమ్మతులు చేయించారు. ఈ రహదారి నుంచి బీచిగానిపల్లి, గొల్లపల్లి, వంగలపల్లి, మోపర్లపల్లికి వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని హరి మట్టిరోడ్డును చదును చేయించాడు.

## ఉచిత న్యాయ సహాయం అందిస్తాం

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్

హిందూపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తప్పులుచేసి జైలులో రిమాండులో ఉన్న ఖైదీలకు ఆర్థిక స్థోమతలేకపోతే ఉచిత న్యాయసాయం అందిస్తామని జిల్లా న్యాయాధికారి సంస్థ కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. శనివారం స్థానిక సబ్‌జైలును తనిఖీ చేశారు. సబ్‌జైలులో ఉన్నవారికి నాణ్యమైన భోజనం ఇవ్వాలని సబ్‌జైలర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు వన్నేరప్ప, శివశంకర్, సుధాకర్, సందీప్, సబ్ జైలర్ హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంటరానితనం నిర్మూలించాలి: తహసీల్దార్

రొళ్ల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అంటరానితనాన్ని నిర్మూలించాలని తహసీల్దార్ షెక్షావలి అన్నారు. మండలంలోని అలుపనపల్లిలో శనివారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరినీ సమానంగా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారి రామలింగయ్య, మాజీ కన్వీనర్ దాసిరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాస్, ఆర్ఐ గిరియప్ప, వీఆర్‌ఓలు, ప్రజలు పాల్గొన్నారు.

## యథేచ్ఛగా కేబుల్ వైర్ల చోరీ

### ఆందోళనలో రైతులు

మడకశిర రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో వ్యవసాయ, తాగునీటి బోర్లకు అమర్చిన కేబుల్ వైర్లు చోరీకి గురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల్లో 300 కు పైగా వ్యవసాయబోర్లు, పంచాయతీ తాగునీటి బోర్లకు అమర్చిన కేబుల్ వైర్లను చోరీ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గురువారం రాత్రి కూడా వైబి హళ్లి ఉన్నత పాఠశాల వద్ద బోరుకు సంబంధించిన కేబుల్ వైర్లు దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ విషయమై సర్పంచు రామాంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తాగునీటి సమస్య లేకుండా చెడిపోయిన బోరును మరమ్మతులు చేస్తున్నామని, అందుకోసం బోరు నుంచి మోటారు, కేబుల్ వైరు బయటకు తీయడం జరిగిందన్నారు. అయితే రాత్రి దొంగలు మోటారును వదిలేసి కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లారని తెలిపారు. తాగునీటి బోర్ల కోసం రూ.35వేలు పెట్టి కేబుల్ కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కేబుల్ వైర్లు చోరీ చేస్తున్న దొంగలపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని కోరారు.

## విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోండి

### అరివిప్రో అకాడమీ సీఈఓ

హిందూపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని అరివిప్రో అకాడమి సీఈఓ అర్జున్ వరదరాజు అన్నారు. శనివారం కిరికెర వద్ద ఉన్న ఎల్‌ఆర్‌జి పాఠశాలలో జరిగిన విద్యార్థి నాయకత్వ బాధ్యతల అవగాహన కార్యక్రమానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకుంటే సమాజానికి సేవ చేయాలనే సంకల్పం వస్తుందన్నారు. అప్పుడే ఇతరులు చెప్పే సమస్యలు కూడా పరిష్కరించేందుకు అవగాహన వస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి, పాఠశాల కార్యదర్శి బాలసుందరం, డైరెక్టర్ నిఖిల్ గోవిందరామ్మూర్తి పాల్గొన్నారు.

# ఇరుకు భవనంలో బడి

### వైసీపీ హయాంలో అర్ధాంతరంగా ఆగిన భవన నిర్మాణం

### త్వరితగతిన పూర్తిచేయాలని తల్లిదండ్రుల వేడుకోలు



గుండుమలలో 80శాతం పనులు పూర్తయిన గురుకుల భవనం

మడకశిర టౌన్, జూన్27(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన మడకశిర ప్రాంతానికి రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు వస్తే ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఆశించిన ఈ ప్రాంత విద్యార్థులు, తల్లిదండ్రులకు నిరాశే మిగిలింది. 2017 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విద్యార్థుల భవితవ్యాన్ని, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన విద్య అందాలన్న సంకల్పంతో గుండుమలలో ఎంజేపీ బాలుర పాఠశాల, కళాశాల భవనాల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నిధులు మంజూరు చేశారు. భవనాల నిర్మాణం పనులు దాదాపు పూర్తికావచ్చాయి. అయితే 2019లో ప్రభుత్వం మారడంతో 80శాతం పనులు పూర్తయిన భవనాల నిర్మాణం పూర్తికి నోచుకోలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా భవనాల పరిస్థితి నెలకొంది. పనులు పూర్తిస్థాయిలో నిలిచిపోయాయి. దీంతో విద్యార్థుల బాధలు వర్ణణాతీతంగా ఉన్నాయి.

### వేధిస్తున్న భవనాల కొరత

గత పాలకుల నిర్లక్ష్యం అభం శుభం తెలియని విద్యార్థుల భవిష్యత్తుపై పడుతోంది. విద్యార్థులకు భవనాల కొరత వేధిస్తోంది. ఎంజేపీ కళాశాల విద్యార్థులను పట్టణంలోని సాయిబాబా ఆలయ సమీపంలోని ఎస్సీ బాలికల హాస్టల్ భవనంలోకి మార్చారు. ప్రస్తుతం దాదాపు 300 మంది విద్యార్థులు చాలీచాలని గదులలో విద్యను అభ్యసిస్తున్నారు. 300 మంది విద్యార్థులకు హాస్టల్ కోసం కేవలం 11 గదులు మాత్రమే ఉన్నాయి. ఇరుకైన గదుల్లోనే వారు చదువుకుంటున్నారు. ఇక 5 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఇటీవల కాలంలో మూడు భవనాలకు వారిని మార్చాల్సి వచ్చింది. తొలుత గుండుమల నుంచి పట్టణంలోని గతంలో వెంకటేశ్వర కళాశాల నిర్వహిస్తున్న భవనంలోకి మార్చారు. అక్కడ కూడా గదుల కొరత కారణంగా 5 నుంచి 8 తరగతులను రేకులకుంట పాత ఎస్సీ హాస్టల్ భవనంలోకి మార్చారు. అక్కడ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌ను నియమించి పాఠశాలను నిర్వహిస్తున్నారు. 9,10 తరగతులను కొద్ది రోజులు వెంకటేశ్వర కళాశాల భవనంలో నిర్వహించారు. అక్కడ నుంచి తిరిగి సౌకర్యాలు లేవని ఆ తరగతులను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలోని ఎస్సీ బాలుర కళాశాశాల హాస్టల్ భవనంలోకి మార్చారు. ఇలా నిలకడగా ఒక్క చోట ఉండలేక తరచూ భవనాలు మారుస్తుండటంతో చదువులపై విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతింటోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. దూర ప్రాంతాలకు పంపి పిల్లలను చదివించే స్థోమత తమకు లేదని, తమ ప్రాంతానికి రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు మంజూరయ్యాయని ఎంతో సంతోషపడ్డామని, అయితే తాత్కాలిక భవనాల్లో అసౌకర్యాల నడుమ చదువుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఊహించలేకపోయామని విద్యారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 5వ తరగతి నుంచి 10 తరగతి వరకు ప్రభుత్వం మారడంతో తిరిగి గుండుమలలోని పాలిటెక్నిక్ కళాశాలలోని భవనాలకు మార్చరు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు కొంత మేర తగ్గాయి. మడకశిర, గుండిబండలో గురుకుల పాఠశాలలో నిర్మాణానికి అప్పట్లో రూ.48కోట్లు మంజూరు అయ్యాయి. వైసీపీ పాలనలో రూ.15 కోట్లు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించక పోవడంతో సమస్యలు తలెత్తాయి. 5 నుంచి 10 తరగతి వరకు 509 మంది విద్యార్థులు ప్రస్తుతం పాలిటెక్నిక్ కళాశాలలో విద్యాఅభ్యసిస్తున్నారు. ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమలతిప్పేస్వామి చొరవ తీసుకుని పనులను ప్రారంభించేలా చేశారని, త్వరలో సమస్య తీరుతుందని తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించేలా చర్యలు తీసుకుని త్వరితగతిన భవనాల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

### పాత భవనాలతో ఇబ్బందులు



పురాతన హాస్టల్ భవనం కావడంతో కోచింగ్ బాగున్నా ఇబ్బందులు తప్పడం లేదు. కళాశాలలో ఆట స్థలం లేదు. ఇరుకు గదుల్లో ఇబ్బందిగా ఉంటోంది. సత్వరమే నూతన భవన నిర్మాణాలు పూర్తిచేయాలి.

- అజయ్, విద్యార్థి

### ఇరుకు గదుల్లో ఇబ్బందులు



కళాశాలలో ఇరుకైన గదులలో సరైన గాలి, వెలుతురు కూడా రావడం లేదు. కొత్తభవనంలోకి కళాశాలను మార్చితే మంచి వాతావరణంలో చదువుకునేందుకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తాం.ఇబ్బందులు వన్న మాట వస్తవమే.

- రాజేష్, విద్యార్థి

### భవనం పూర్తయితే సౌకర్యంగా ఉంటుంది



ఎంజేపీ బాలుర పాఠశాల భవన నిర్మాణం పనులు పూర్తయితే విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. అన్ని హంగులతో నిర్మించిన భవన సముదాయం కావడంతో విద్యార్థుల చదువులకు మంచి వాతావరణం ఏర్పడి ఉత్తమ ఫలితాలు వచ్చేందుకు ఆస్కారముంటుంది. ప్రస్తుతం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీతో ఎంఈసీ కోర్సు గత ఏడాది అదనంగా రావడంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది.

- బషీర్ ఉన్నీషా, ప్రిన్సిపాల్, ఎంజేపీ బాలుర పాఠశాల

## అభివృద్ధిని చూసి వలసలు

### టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధినిచూసి టీడీపీలోకి వలసలు ప్రారంభమయ్యాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. శనివారం బాలాజీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఎ.ఆర్.రొప్పం గ్రామానికి చెందిన 12 కుంటుంబాలు వైసీపీ నుంచి టీడీపీ లోకిచేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆయన ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పార్టీలోకి రావడానికి మొగ్గుచూపుతున్నారన్నారు. ఎ.ఆర్.రొప్పం గ్రామానికి వైసీపీ నాయకులు వి.మంజునాథ్, అశ్వథప్ప, నంజుండప్ప, రంగప్ప, బి.మంజునాథ్, బి.శ్రీనివాస్, రామ్మూర్తి, లక్కప్ప, ఆదేప్ప, మల్లికార్జున, సిద్దప్ప, గోవిందప్ప తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ నాగరాజు, మాజీ కన్వీనర్ లక్ష్మీనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జి రంగేగౌడ్, జనరల్ సెక్రటరీ మారుతీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మూడోసారి పట్టుబడితే పీడీ యాక్ట్

### ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య



స్టేషన్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న డీసీ

హిందూపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తీసుకొస్తూ మూడోసారి పట్టుబడితే పీడీయాక్ట్ నమోదు చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. శనివారం హిందూపురంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ తూమకుంట చెక్‌పోస్టులో ఉన్న ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలని కర్ణాటక నుంచి మద్యాన్ని పూర్తిగా అరికట్టాలన్నారు. కల్తీకల్లు అమ్మకందారులకు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఎక్కువ కేసులున్నవారిని జిల్లా బహిష్కరణకు చర్యలు చేపట్టాలన్నారు. కేసులో పట్టుబడిన వాహనాలను త్వరితగతిన కోర్టుద్వారా పరిష్కరించాలన్నారు. డీసీ వెంట ఎన్ఫోర్స్‌మెంట్ ఏసీ శ్రీరామ్, స్థానిక సీఐ లక్ష్మీదుర్గయ్య, సిబ్బందిపాల్గొన్నారు.

మడకశిర టౌన్(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నాటుసారా తయారీపై నిఘా పెట్టాలని డీసీ నాగమద్దయ్య ఆదేశించారు. శనివారం మడకశిరలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఏసీ శ్రీరాంతో కలసి మద్యం షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయిస్తున్నారా..? లేదా..? తదితరాలనను పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ మురళి కిషోర్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## యేసు సూక్తులు అనుసరణీయం

### బైబిల్ మిషన్ మోక్ష మార్గోపదేశ సభలో వక్తలు

పెనుకొండ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బైబిల్ మిషన్ చర్చి ఆధ్వర్యంలో మోక్ష మార్గోపదేశ సభలు శనివారం ఘనంగా నిర్వహించారు. సభకు విచ్చేసిన వక్తలు యేసు బోధించిన సూక్తులను వివరించారు. ప్రతిఒక్కరూ ప్రేమానురాగంతో జీవిస్తూ అన్నిమతాలు, కులాలవారిని ప్రేమించాలన్నారు. సన్మార్గంలో జీవించే వారికి మోక్ష భాగ్యము లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బైబిల్ మిషన్ బందెలరాజు, ఏట మనోహర్, జీఎం ప్రభాకర్ రాజు, ఇస్సాకుబాబు, పాల్, తిమోతి విజయ్‌కుమార్, సన్మాన్, టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు, బహుజన చైతన్యవేదిక శివరామక్రిష్ణ, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

## బోల్తాపడ్డ లారీ

### అద్దాలు తీసుకెళ్తుండగా ఘటన



రోడ్డుపై చల్లాచెదురుగా పడ్డ అద్దాలు

సోమందేపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగమాకులపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఉదయం బెంగళూరు వైపు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న అద్దాలను తీసుకెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీ కొనడంతో బోల్తాపడింది. దీంతో అద్దాలు జాతీయరహదారిపై చల్లాచదురుగా పడిపోయాయి. దాదాపు 2గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి లారీలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు. ఇరువురికి స్వల్ప గాయాలైనట్లు ఏఎస్ఐ మురళి తెలిపారు.

## విశ్వశాంతి కోసం కృషి

### -బ్రహ్మకుమారి సుగంధ బెహన్

గోరంట్ల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతి కోసం కృషి చేస్తున్నట్లు బ్రహ్మకుమారి సుగంధ బెహన్ అన్నారు. ఈశ్వరీ విద్యాలయం ఆధ్వర్యంలో పట్టణంలోని వాసవీ మహల్‌లో శిక్షణ కార్యక్రమం శనివారం జరిగింది. పలు కేంద్రాలనుంచి 150మంది బ్రహ్మకూమారీలు శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానసిక ఒత్తిడి వల్ల కలిగే సమస్యలను వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మకూమారీలు హేమలత, కమల, లీలా, ఆర్యవైశ్య సంఘం నాయకులు బలరాం గుప్తా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుగందబెహన్

## వారంలోపు తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

### - టీడీపీ నాయకులు

పెనుకొండ రూరల్, జూన్28(ఆంధ్రజ్యోతి): వారంలోగా తాగునీటి సమస్య తీరుతుందని టీడీపీ నాయకులు అన్నారు. నగర పంచాయతీ కోనాపురంలో తాగునీటి సమస్య అధికమైంది. దీంతో వారు సమస్యను తెలుపగా మంత్రి సవిత చొరవచూపి బోరుబావి తవ్వించారు. వారంలోగా ప్రతిఇంటికి నీరు వస్తుందని టీడీపీ నాయకులు గ్రామస్థులకు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు త్రివేంద్ర, రామలింగం, సుబ్రహ్మణ్యం, ప్రసాద్ పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌కు మంత్రి పరామర్శ



ఆరోగ్యం స్థితిపై ఆరాతీస్తున్న మంత్రి సవిత

రొద్దం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కంచిసముద్రం గ్రామం, ఆర్.లోచర్ల మాజీ సర్పంచ్ హనుమంతరాయప్పను మంత్రి సవిత పరామర్శించారు. శనివారం సాయంత్రం అనంతపురంలో చికిత్స పొందుతున్న ఆయనను పరామర్శించి ఆరోగ్య స్థితిపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని, అధైర్యపడవద్దని, అండగా ఉంటామన్నారు. ఆమె వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి అత్మరావు సీనియర్ టీడీపీ నాయకుడు మాధవనాయుడు, కన్వీనర్ నరహరి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం అందజేత

మాజీ సర్పంచ్ హనుమంతరాయప్పకు రూ.60వేలు ఆర్థిక సాయాన్ని టీడీపీ నాయకుల ద్వారా మంత్రి సవిత అందజేశారు. లోచర్ల గ్రామ పంచాయతీ నాయకులు, కార్యకర్తలు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి ఉదయం వెళ్లి ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు మురళి, రామాంజినేయులు, ముత్యాలప్ప, జెల్లి, అంజినప్ప, నరసింములు, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సోమందేపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగినాయనిచెరువు తండాలో శనివారం ఎంపీడీఓ వెంకటలక్ష్మీ ఉపాధి పనులు పరిశీలించారు. తెల్లగుట్ట వద్ద చేస్తున్న కందకాల పనులను తనిఖీ చేశారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కూలీలకు చెప్పారు. పే స్లిప్పులు అందుతున్నాయా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాదికూలీలు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పథకాలపై అవగాహన

మండలంలోని నాగినాయనిచెరువుతండాలో భగీరథ అభియాన్ పథకంలో భాగంగా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. సీసీరోడ్డు, డ్రైనేజీ, ఓహెచ్‌ఆర్ ట్యాంకుల నిర్మాణం, సీఎం కిసాన్, ఆయుష్మాన్ భారత్ కార్డులు, ప్రధానమంత్రి మాతృవందన యోజన తదితర పథకాలపై స్థానికులకు వివరించారు. ఇల్లులేని వారికి ప్రధానమంత్రి ఆవాజ్‌యోజన పథకం ద్వారా ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సూర్యఘర్ ద్వారా ఇంటిపై సోలార్‌ను ఏర్పాటుచేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజినాయక్, ఎంపీడీఓ వెంకటలక్ష్మీ, ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ, డీటీ రెడ్డిశేఖర్ హౌసింగ్ ఏఈ రామాంజినేయులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మహేష్, ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి, ఏఓ విజయభారతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బారాణి, కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

## సమ్మెను జయప్రదం చేయండి: సీఐటీయూ

సోమందేపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వచ్చేనెల 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి సాంబశివ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. కార్మికులకు అనుకూలంగా ఉన్న 44 చట్టాలను రద్దుచేసి నాలుగు బార్‌కోడ్‌లను తెచ్చిందన్నారు. వీటిని నిరసిస్తూ దేశవ్యాప్తంగా సమ్మెను చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం కన్వీనింగ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా శ్రీదేవి, కోకన్వీనర్లుగా గాయిత్రి, నాగభూషణం, వీరితోపాటు 9మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, అనుబంధ సంఘాల నాయకులు రంగప్ప, రవి, మల్లిక, రజియ, భారతి, ప్రతిభ, వేదవతి, రమాదేవి పాల్గొన్నారు.

మడకశిర టౌన్, జూన్28(ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘాల పిలుపు మేరకు జులై9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేష్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో మండల ప్రథమ మహాసభను నిర్వహించారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని వెంకటేశ్ ఈ సందర్భంగా మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు పద్మావతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఏకల్ అభియాన్ శిక్షణ తరగతులు

గోరంట్ల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయంలో ఎకల్ అభియాన్ శిక్షణ తరగతులు శనివారం నిర్వహించారు. విద్యాలయాల ఆచార్య, మాతాజీలకు సంస్కృతి, సంప్రదాయాలపట్ల అవగాహన కల్పించారు. విద్యార్థులకు దేశభక్తి, సంప్రదాయలపై ఆయా గ్రామాల్లో సాయంత్రం రెండుగంటలపాటు మాతాజీలు శిక్షణ ఇస్తారు. గోరంట్ల, పెడబల్లి, పుట్టపర్తినుంచి మాతాజీలు హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి ఆచల్ అభియాన్ ప్రసాద్, గోరంట్ల సంచ్ సాధక్ రామమోహన్‌రెడ్డి, అధ్యక్షులు నర్రెడ్డుల రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇటుక బట్టీల పొగతో ప్రమాదాలు



ఇటుక బట్టీల నుంచి వెలువడుతున్న పొగ

లేపాక్షి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కొడికొండ-శిర జాతీయ రహదారి లేపాక్షి వద్ద ఇటుకభట్టీలు తయారు చేస్తున్నారు. జాతీయరహదారి పక్కనే ఇటుక భట్టీలు తయారు చేస్తుండటంతో వాటి నుంచి వచ్చే పొగ జాతీయరహదారిని కమ్మేస్తుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి కనబడకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ద్విచక్రవాహనాల్లో ప్రయాణించే చిన్న పిల్లలకు పొగవల్ల ఊపిరాడక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటుక భట్టీలకు రహదారి పక్కనే మదరస పాఠశాల ఉంది. ఇందులో చదివే విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇటుక భట్టీలపై చర్యలు తీసుకుని ప్రమాదాలు నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

## క్షేమంగా ఇంటికి...

లేపాక్షి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): బిసలమానేపల్లి పంచాయతీ రాజీవ్‌కాలనీ వద్ద ఉన్న ప్రభుత్వ డాక్టర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మహేంద్ర ఉదయం 8గంటల ప్రాంతంలో అదృశ్యమయ్యాడు. ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తల్లిదండ్రులను సంప్రదించగా విద్యార్థి ఇంటికి చేరినట్లు వారు తెలిపారు.